www.vaarthavedhikasurya.com

RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

SCAN ME

యాదాద్రి భువనగిరి | శనివారం, జులై 5, 2025 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 263 | పేజీలు: 08 | వెల: 5/-



## హైదరాబాద్‌లో మాజీ సీఎం రోశయ్య విగ్రహం

**లక్డీకాపూల్‌లో ఆవిష్కరించిన మల్లికార్జున ఖర్గే**

హైదరాబాద్,జూలై4(వార్త వేదిక సూర్య): నగరంలోని లక్డీకాపూల్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. రోశయ్య జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నేతలు నివాళిఅర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. వైఎస్ మరణం తరవాత ఆయన సిఎంగా పనిచేశారు. తరవాత తమిళనాడు గవర్నర్‌గా వెళ్లారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రభుత్వం విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేతుల మీదుగా ఆవిష్కరించిన ఈ కార్యక్రమంలోసీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యకర్తలు కూడా భారీగా తరలివచ్చారు.



## కేంద్రంలో అధికారంలోకి వస్తాం..

# దేశాన్ని రక్షిస్తాం

- అబద్ధాల ప్రచారంలో మోడీ సిద్ధహస్తుడు
- విదేశాలు చుట్టే మోడీకి మణిపూర్ వెళ్లే తీరిక లేదు
- తెలంగాణకు 11 ఏళ్లలో చేసింది శూన్యం
- కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభలో ఖర్గే విమర్శలు

హైదరాబాద్,జులై 4 (వార్త వేదిక సూర్య): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లే.. కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరుతుందని ఏఐసీసీ అధ్యక్షులు, ఎంపీ మల్లికార్జున్ ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. దేశరక్షణ కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆయన పురుద్ఘాటించారు. విదేశాలు తిరుగుతున్న మోడీ, మణిపూర్‌కు మాత్రం ఇప్పటి వరకు వెళ్లలేదని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. దేశానికి ప్రధాని మోదీ, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చాలా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కానీ వాళ్లు ఈ దేశానికి, తెలంగాణకు చేసిందేమిటని సూటిగా ప్రశ్నించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పటి వరకు ప్రధాని మోదీ 42 దేశాలు తిరిగారని గుర్తు చేశారు. కానీ ప్రజలు చనిపోతున్నా.. మణిపూర్ మాత్రం ఆయన వెళ్లలేదని మండిపడ్డారు. పాకిస్థాన్‌ను ఏదేదో చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించార న్నారు. కానీ ఎందుకు ఏం చేయలేదని మోదీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. పాకిస్తాన్‌పై యుద్ధం చేయకుండా.. మిమ్మల్ని ఎవరు మిగతా 2లో..



## రైతు సంక్షేమంపై

# చర్చిద్దాం రండి

- ఢిల్లీలో ఉండే మోడీ... గల్లీలో ఉండే కెడీ అయినా చర్చకు సిద్ధం
- కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం
- ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత తమదే
- ఎల్బీ స్టేడియం సామాజిక సదస్సులో సిఎం రేవంత్

హైదరాబాద్,జులై 4(వార్త వేదిక సూర్య): ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి, సవాళ్లకు సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలకు గట్టి సవాల్ విసిరారు. కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి, వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ రేవంత్ రెడ్డి గర్వంగా వెల్లడించారు. 24 గంటల ఉచిత కరెంట్, రుణమాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు మిగతా 2లో..

## రోశయ్య అరుదైన రాజకీయ వేత్త

- బడ్జెట్ సర్దుబాటులో ఆయనది అందెవేసిన చేయి
- 16సార్లు బడ్జెట్ సమర్పించిన ఘనత రోశయ్యది
- రోశయ్య జయంతి వేడుకల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్




హైదరాబాద్,(వార్త వేదిక సూర్య): దేశంలో ఒక రాష్ట్ర ఆర్థికమంత్రిగా అత్యధికంగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యదని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. అప్పులు చేయకుండా ఉన్నంతలో బ్జడెట్‌ను సర్దుబాటు చేయడంలో రోశయ్యది అందెవేసిన చెయ్యని అన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రుల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కొరత లేకుండా సర్దుబాటు చేసిన ఘనత రోశయ్య గారిదని అన్నారు. నిండైన తెలుగు తనానికి ప్రతిరూపం రోశయ్య అని,. పంచెకట్టు, భుజంపై పై పంచెతో ఆకట్టుకునే ఆహార్యం రోశయ్యదని అన్నారు. స్వర్గీయ కొణిజేటి రోశయ్య 92వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆద్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన సభలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, మిగతా 2లో..

## ఆగస్టు 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు

- నెలరోజులపాటు జరుగనున్న వర్షాకాల భేటీ

న్యూఢిల్లీ,జులై4(వార్త వేదిక సూర్య): జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఆగస్టు 21 వరకు నెల రోజుల పాటు సభా



కార్యకలాపాలు జరగనున్నాయి. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల షెడ్యూల్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలినట్లు కేంద్ర పార్లమెంటరీ మిగతా 2లో..

## దక్షిణాదిపై బిజెపి గురి!

- తొలి ప్రయత్నంగా మహిళా అధ్యక్షురాలు
- ముందువరుసలో నిర్మలా సీతారామన్, వానతీ శ్రీనివాసన్




న్యూఢిల్లీ,జూలై4(వార్త వేదిక సూర్య): సంస్థాగత ఎన్నికల ప్రక్రియను భారతీయ జనతా పార్టీ వేగంగా ముందుకు తీసుకుని వెళ్తున్న వేళ కొన్ని ఆసక్తికర అంశాలు తెరపైకి వస్తున్నాయి. ప్రధానంగా దక్షిణాదిలో పాగా వేయాలన్న బలమైన కోరికతో ఉంది. ఉత్తరాది పార్టీ అన్న ముద్రను తొలగించుకునే క్రమంలో వేస్తున్న అడుగులు ఇప్పుడు జాతీయ అధ్యక్ష పదవి విషయంలో ఆయరించే ప్రయత్నాలు మొదలయ్యాని తెలుస్తోంది. బిజెసి సాహసాలు చేయడంలోను, ప్రయోగాలు చేయడంలోనూ ముందుంటుంది. దీనితో ఏ పార్టీ పోటీపడలేదు. కాంగ్రెస్‌లో ఇందిర కుటుంబ వారసత్వమే కొనసాగుతుంది. ప్రాంతీయ పార్టీల్లో కూడా వారసత్వ రాజకీయాలే ఉంటాయి. ఈ వాసనలు లేకుండా మనగలుగుతున్న పార్టీ బిజెపి మాత్రమే. ఇందులో చేరిన సామాన్యులు కూడా అసామాన్యులుగా ఎదిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈసారి దక్షిణాది నుంచి పార్టీ అధ్యక్ష పదవిని ఎంచుకునే విషయాన్ని పరిశీలిస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. మిగతా 2లో..

## హిమాచల్‌లో వరద బీభత్సం

- భారీ వర్షాలకు 63మంది మృతి..పలువురు గల్లంతు

సిమ్లా,జూలై4(వార్త వేదిక సూర్య): హిమాచల్‌ప్రదేశ్‌పై జలఖడ్గం విరుచుకుపడింది. గత కొద్ది రోజులుగా ప్రకృతి ప్రకోపం చల్లారడం లేదు. ఓ వైపు కుండపోత వర్షాలు.. ఇంకోవైపు కొండచరియలు విరిగిపడడంతో భారీగా ప్రాణ, ఆస్తి జరిగింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు భయాందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు 63 మంది చనిపోగా.. రూ.400 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక డజన్ల కొద్దీ గల్లంతయ్యారు. వారి వివరాలు తెలియడం లేదు. గత కొద్ది రోజులుగా మిగతా 2లో..





## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుంది

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- సిగాచి పరిశ్రమను సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- శాఖల అధికారులతో సమీక్ష నిర్వహణ

సంగారెడ్డి, 04 జులై (వార్త వేదిక సూర్య): సిగాచి పరిశ్రమంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన కార్మికుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన పటాన్చెరువు మండలం, పాశమైలారం పారిశ్రామికవాడలోని మిగతా 2లో..

## ఆపరేషన్ సిందూర్... ముగ్గురితో యుద్ధం

- ఒక సరిహద్దు ఇద్దరు శత్రువులు
- పాక్‌కు మద్దతుగా చైనా, టర్కీల సాయం
- భారత్ బలగాల సమిష్టి విజయం ఇది
- డిప్యూటీ ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్

న్యూఢిల్లీ,జులై 4(వార్త వేదిక సూర్య): ఆపరేషన్ సిందూర్ సమయంలో ఒకేసారి మేడు దేశాలతో యుద్ధం చేయాల్సి వచ్చిందని భారత డిప్యూటీ ఆర్మీ చీఫ్ లెప్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఆపరేషన్ సింధూర్ నిర్వహించిన సమయంలో పాకిస్థాన్‌కు చైనా, టర్కీలు మద్దతుగా మిగతా 2లో..




## అసెంబ్లీ మీడియా సలహా మండలి మెంబర్‌గా సీనియర్ జర్నలిస్టు సుంచు అశోక్

- నియామక ఉత్తర్వులను జారీ చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్



యాదాద్రి భువనగిరి,జూలై 04(వార్త వేదిక సూర్య): హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ మీడియా సలహా మండలి మెంబర్‌గా సీనియర్ జర్నలిస్టు సుంచు అశోక్ నియమించారు. ఈ మేరకు శుక్రవారం నాడు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు ఉత్తర్వులు జారీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాయాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన సుంచు అశోక్ దాదాపు 20 సంవత్సరాలకు పైగా జర్నలిస్టుగా పని చేస్తున్నారు. గతంలో యాదగిరిగుట్టలో 1999 సంవత్సరం నుంచి ప్రజా పోరు, సూర్య దినపత్రిక లో మండల రిపోర్టర్ గా పని చేశారు. 2011 నుంచి హైదరాబాదులో నమస్తే తెలంగాణ, ఆంధ్రప్రభ స్టేట్ బ్యూరోలో పని చేశారు. ఇప్పుడు విజయక్రాంతి దిన పత్రికలో పనిచేస్తున్నారు. స్పీకర్ ఉత్తర్వుల ప్రకారం రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. తనను అసెంబ్లీ మీడియా సలహా మండలి మెంబర్‌గా నియమించిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మిగతా 2లో..




## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుంది

(మొదటి పేజీ తరువాయి)

సిగాచి ఫార్మా పరిశ్రమను సందర్శించారు. స్పెషల్ సెక్రటరీ రెవెన్యూ & డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ,అరవింద్ కుమార్ , పరిశ్రమలు, కార్మిక శాఖ, స్పెషల్ సెక్రటరీ దాన కిషోర్, జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, అగ్నిమాపక శాఖ అధికారుల తో పరిశ్రమలో అగ్నిమాపక శాఖ, పొల్యూషన్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది, పరిశ్రమల శాఖ సిబ్బంది,కంపెనీ ప్రతినిధులు ,పోలీసులు ,రెవెన్యూ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష జరిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, పరిశ్రమల భద్రతా ప్రమాణాలు, సేఫ్టీ మెకానిజం నిర్వహణపై సంబంధిత శాఖలతో ఆయన సమీక్షించారు. పరిశ్రమలో రియాక్టర్లు, డ్రైయర్లు, ఫైర్ ఫైట్ సిస్టం, ఉద్యోగుల రక్షణ మార్గాలు, ఇతర భద్రతా అంశాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ... ప్రమాదంలో గాయపడినవారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామన్నారు.

ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వివరాలు మృతుల వివరాలు మృతుల ఐడెంటిఫికేషన్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యుల కోసం ఐలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతోమాట్లాడారు.ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా త్వరలో మృతుల కుటుంబాలకు క్షతగాత్రుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సహాయ చర్యలు మరింత సమర్థవంతంగా సాగేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ మీడియా సలహా మండలి మెంబర్‌గా సీనియర్ జర్నలిస్టు సుంచు అశోక్

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డికి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు గారికి, స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారికి సుంచు అశోక్ ధన్యవాదాలు తెలియజేశారు. కాగా, 15 మందితో ఏర్పాటు చేసిన మీడియా సలహా మండలి లో చైర్మన్ గా ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కో చైర్మన్ గా పోలోజు పరిపూర్ణాచారి, సభ్యులుగా సీనియర్ జర్నలిస్టులైన అయితరాజు రంగారావు, బొడ్లపాటి పూర్ణచంద్రారావు, ఎల్ వెంకట్రాం రెడ్డి, పొలంపల్లి ఆంజనేయులు, ఎం పవన్ కుమార్, భీమనపల్లి అశోక్, బుర్ర ఆంజనేయులు గౌడ్, సురేఖ అబ్బూరి, మహమ్మద్ నయీమ్ వజాహత్, బసవపున్నయ్య , ప్రమోద్ కుమార్ చతుర్వేది, సుంచు అశోక్, బీహెచ్ఎంకే గాంధీ నియమితులయ్యారు.

## ఆగస్టు 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దిన వేడుకలు ఉన్నందున 13, 14 తేదీల్లో సమావేశాలు ఉండవని తెలిపారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రవాద దాడిపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. ఈ సమావేశాల్లోనే బీమా సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశముంది. బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 100 శాతానికి పెంచుతున్నట్లు తెలుస్తోంది. బిల్లు ముసాయిదా సిద్ధంగా ఉంది. పహల్గాం ఉగ్రదాడి, ఆ తదుపరి చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్-పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కూడా ఈ సందర్భంగా చర్చించాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో వర్షాకాలపు సమావేశాలు వాడి వేడిగా జరిగే అవకాశముంది. గతలో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు రెండు భాగాలుగా జరిగాయి. మొదటి సమావేశం జనవరి 31న ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకూ కొనసాగింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాల రెండవ భాగం మార్చి 10న ప్రారంభమై ఏప్రిల్ 4న ముగిసింది.

## హిమాచల్‌లో వరద బీభత్సం


(మొదటి పేజీ తరువాయి)

హిమాచల్‌ప్రదేశ్‌లో నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలు కారణంగా మేఘాలు రాష్ట్రాన్ని కమ్ముకున్నాయి. అంతేకాకుండా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఇంకోవైపు భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఇప్పటి వరకు 63 మంది చనిపోగా.. పదుల కొద్దీ గల్లంతయ్యారు. మరోవైపు అధికారులు సహాయ చర్యలు చేపట్టారు. ఇక జూలై 7 వరకు అన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రూ.400 కోట్ల విలువైన ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం తెలిపింది. మండి జిల్లాలో సహాయ, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. రుతుపవనాలు జూన్ 20న హిమాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. ప్రతి సంవత్సరం మాదిరిగానే రాష్ట్రవ్యాప్తంగా విధ్వంసం సృష్టించాయి. తాజా సమాచారం ప్రకారం మండి జిల్లాలో 40 మంది మరణించగా, కాంగ్రాలో 13 మంది, చంబాలో ఆరుగురు, సిమ్లాలో ఐదుగురు మరణించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇక వందలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. 14 వంతెనలు కొట్టుకుపోయాయి. 300 పశువులు చనిపోయాయి. ఇక విద్యుత్ సబ్‌స్టేషన్లు దెబ్బతినడంతో వేలాది మంది ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. నీరు, ఆహారం కొరత కూడా ఏర్పడింది.

## రోశయ్య అరుదైన రాజకీయ వేత్త

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు, వైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సభా వేదికపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుని ప్రముఖులు సన్మానించారు. .ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషం. గొప్ప రాజకీయ నేతకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. ఇలాంటి మంచి నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులకు నా అభినందనలు తెలుపుతున్నానని అన్నారు అదేవిధంగా ఈరోజు వారి విగ్రహాన్ని




నెలకొల్పి ఆవిష్కరించడం ద్వారా రోశయ్య గారి గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు వారి తెలియజేయడం జరిగిందన్నారు. ఇక వాక్పటిమ, వాగ్దాటి, చతురతలో రోశయ్య గారితో ఇంకొకరిని పోల్చలేం. కాంగ్రెస్ ప్రభుత్వంలో గవర్నర్ గా నియామకం అయ్యి బిజేపి ప్రభుత్వంలో కూడా కొనసాగిన అరుదైన వ్యక్తులలో రోశయ్య గారు ఒకరు. రాజకీయ విభేదాలు ఉండవచ్చు కానీ వ్యక్తిగతంగా అందరికీ అజాత శత్రువు రోశయ్య గారని అన్నారు. రోశయ్య గారిది మన తెలంగాణ ప్రాంతం కాకపోయినా వారిని మనం గౌరవించడానికి కారణం మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం వారి పెద్దరికానికి గౌరవం ఇవ్వడమేనని అన్నారు. రోశయ్య గారు శాసనసభలో మాట్లాడుతుంటే స్వపక్షంతో పాటుగా విపక్షాలు కూడా ఏకాగ్రతతో వినేవాళ్ళు. యువ, నూతన శాసన సభ్యులకు రోశయ్య గారి ప్రసంగం ఒక పుస్తకం. 2008 ఉప ఎన్నికలలో నేను మొదటిసారి శాసనసభ్యునిగా ఎన్నికై అసెంబ్లీకి వచ్చినప్పుడు సమావేశాలో రోశయ్య గారి ప్రసంగాలను ప్రత్యేక్షంగా వినే భాగ్యం కలిగింది, వారి ప్రసంగాలకు నేను అభిమానిని.వారి నుండి నేను ఎన్నో విషయాలను నేర్చుకున్నాను.




## కేంద్రంలో అధికారంలోకి వస్తాం.. దేశాన్ని రక్షిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఆపారంటూ సందేహం వ్యక్తం చేశారు. పలహ్గాం ఘటన తరవాత ఆపరేషన్ సింధూర్‌కు కాంగ్రెస్ మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. దేశ ఆర్థిక పరిస్థితిని ప్రధాని మోదీ చిన్నాభిన్నం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలని 'ఆపరేషన్ సిందూర్'కు రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ కూడా సంపూర్ణ మద్దతు ఇచ్చింది. మరి మోదీ ఎందుకు యుద్ధాన్ని మధ్యలోనే ఆపేశారు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేయగానే యుద్ధం ఆపేశారు.. కానీ ఆ విషయంపై ప్రధాని నోరు విప్పరు. మణిపూర్ ఈ దేశంలో భాగం కాదా? మణిపూర్ వాసులు భారతీయులు కాదా?అఖిలపక్ష సమావేశానికి ప్రధాని రాలేదు.. బిహార్ ఎన్నికల ప్రచారంలో ఆయన బిజీగా ఉన్నారు' అని ఖర్గే విమర్శించారు. ప్రధాని మోదీలాగా ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు భయపడ లేదన్నారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్య్రం కల్పిస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని అంటూ ఆయన ఎద్దేవా చేశారు. రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసి వేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలోనే లేదని బీజేపీ చెపుతుందన్నారు. ÷ాజ్యాంగం నుండి లౌకిక పదాన్ని తీసేయారని తాను చాలెంజ్ చేస్తున్నానని ఈ సందర్భంగా ఖర్గే ప్రకటించారు. సెక్యులర్ అనే పదం బీజేపీ ప్రణాళికలో రాసుకున్నారని వివరించారు. సెక్యులర్ అనే పదంతో మీకు ఇబ్బంది ఉంటే మీ పార్టీ ప్రణాళిక నుంచి తీసివేయాలని బీజేపీ అగ్రనేతలకు ఖర్గే బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందంటే.. అది కార్యకర్తల కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. రేవంత్, భట్టి, మంత్రులు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారన్ని వివరించారు. కేసీఆర్, బీజేపీ కలిసి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అడ్డుకుంటున్నారన్నారు. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలను ఓడించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని గతంలో తాను చెప్పానని వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో 50కిపైగా కేంద్ర సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణకు ఈ 11 ఏళ్లలో ఏం ఇచ్చారంటూ ప్రధాని మోదీని ఈ సందర్భంగా ఖర్గే సూటిగా ప్రశ్నించారు. గతంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను కేసీఆర్ మోసం చేశారు. ప్రధాని మోదీ, అమిత్‌షా అబద్దాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అందిస్తోంది. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ.8,200 కోట్లు జమ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోంది. గిగ్ వర్కర్ల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొస్తోంది. దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమే. బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందన్నారు.

## రైతు సంక్షేమంపై చర్చిద్దాం రండి

(మొదటి పేజీ తరువాయి)

ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. ఇది కాదని నిరూపించ గలరా అని సవాల్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. రైతుల బాగు కోసం ఎవరు ఎంత చేశారో తేల్చుకునేందుకు రావాలని కోరారు. రైతుల కోసం 18 నెలల్లో రూ.1.04లక్షల కోట్లు ఖర్చు చేశాం. వరి వేస్తే ఉరి వేసుకున్నట్టేనని గత సీఎం చెప్పారు.. 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండించి దేశానికే ఆదర్శంగా నిలిచాం. రైతుభరోసాలో ప్రభుత్వం విఫలమవుతుందని కొందరు ఎదురు చూశారు.. కానీ వారి ఆశ నెరవేరలేదు. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో.. ఎక్కడైనా చర్చ చేసేందుకు సిద్ధం. చర్చకు ఎవరొస్తారో రండి.. కేసీఆర్, మోదీ, కిషన్‌రెడ్డి.. ఇలా ఎవరొచ్చినా సరే. కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నా.. పేదలు ఎప్పుడూ బర్రెలు, గొర్రెలు మేపుతూనే బతకాలా?కేసీఆర్, మోదీకి సవాల్ విసురుతున్నా. లెక్క కావాలంటే చెప్పండి.. అందర్నీ తీసుకొచ్చి స్టేడియంలో నిలబెట్టి లెక్కవేయిస్తా. 60వేలకు ఒక్కరు తక్కువ వచ్చినా కాళ్లు మొక్కి తప్పుకొంటా' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు, పథకాలను అమలు చేస్తోందన్నారు. అనేక కష్టాలు ఎదురైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నిలబడి, సమస్యలను అధిగమించి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించే దిశగా పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలో తెలంగాణ రైతులు ఈ ఏడాది 2 కోట్ల మెట్రిక్ టన్నుల రైస్‌ను ఉత్పత్తి చేసినట్లు సీఎం గుర్తు చేశారు. ప్రజా పాలనలో ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులకు సరైన ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

కేవలం 9 రోజుల వ్యవధిలో రూ. 9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భరోసాను అందించడమే కాకుండా, వ్యవసాయాన్ని ఒక పండుగగా మార్చిందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, ఆర్థిక పునరుద్దరణ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూడు రంగుల జెండా చేతబూని కల్వకుంట్ల గడీని బద్దలు కొట్టామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి గుండెను తడుతూ ప్రజాపాలన సాగిస్తున్నామని చెప్పారు.



వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయని.. మహిళలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయని చెప్పారు. కార్యకర్తలకు అన్ని పదవులు దక్కే వరకూ విశ్రాంతి తీసుకోబోనని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని.. దాని కంటే ఒక్క సీటు తక్కువ వచ్చినా తనదే బాధ్యతని చెప్పారు. 'కాంగ్రెస్ నేతలు కలిసి ఉండలేరని ఈ పాలన మూణ్నాళ్ల ముచ్చటే అని కొందరు అన్నారు. కానీ.. పార్టీ నేతలంతా ఐకమత్యంతో పనిచేస్తూ ఆ అపోహలను పటాపంచలు చేశారు. జనగణనతో పాటు కులగణన.. ఎస్సీ వర్గీకరణ చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాటిచ్చారు. హామీ ఇచ్చినట్టుగానే ఏడాదిలోపే కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి చూపించాం. 18 నెలల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించాం. కష్టాలు, ఒడిదొడుకులు వచ్చాయి.. అన్నీ అధిగమించి ముందుకెళ్తున్నాం. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు అనేక మంది కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దక్షిణాదిపై బిజెపి గురి!

(మొదటి పేజీ తరువాయి)

అందులోనూ మహిళలయితే మంచిదనే భావనా ఉంది. దీనికితోడు ఉత్తర, దక్షిణ భారతాలు కలుపుతూ...భాషా పరంగా నైపుణ్యాలు ఉండేవారిని కూడా వెతుకుతున్నారని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే నిర్మలా సీతారామన పేరు తాజాగా తెరపైకి వచ్చింది. ఆమె హిందీ, ఇంగ్లీష్ అనర్గళంగా మాట్లాడడమే గాకుండా కఠినంగా పరిశ్రమ చేయగలరు. ఇకపోతే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికను నిర్వహించాలంటే కనీసం 19 రాష్ట్రాల్లో బిజెపి సారథుల నియామకాలు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో అధ్యక్షులను ఖరారు చేశారు.

ఈ క్రమంలో ఇటీవలే అనేక రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ అధ్యక్షుల ఎంపిక సాగింది. తెలంగాణకు రామచంద్రరావు, ఎపికి మాధవ్‌లు ఎంపికయ్యారు. వీరిద్దరూ పార్టీకి అంకితమై పనిచేస్తున్నవారే. ఇక్కడ కులాల కన్నా పార్టీకి అంకితమై ఉన్నవారినే గుర్తించారు. ఇలా అధ్యక్షుల ఎంపిక పూర్తయిన తర్వాత పార్టీ నిబంధనల ప్రకారం జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరగనుంది. ఈసారి భాజపా జాతీయ అధ్యక్ష పదవిని దక్షిణాదికి మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ ఊహాగానాలు వస్తున్నాయి. ఎందుకంటే దక్షిణాదిపై గురిపెట్టిన బిజెపి ఇలా చేయడంలో ఆశ్యర్యం లేదు. గతంలో వెంకయ్యానాయుడు పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. తరవాత ఉపరాష్ట్రపతి కూడా అయ్యారు. జాతీయ అధ్యక్ష పదవి రేసులో పరధానంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరూ తమిళనాడుకు చెందిన వారే కావడం గమనించాలి. అలాగే పార్టీలో మహిళలకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో కూడా దక్షిణాది నుంచి మొట్టమొదటి మహిళా నాయకురాలిని ఎన్నుకునేం దుకు ఆలోచనలు చేస్తున్నారని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో భాజపా అధ్యక్ష పదవి రేసులో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మొదటి స్థానంలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. పార్టీలోని అత్యంత ప్రభావవంతమైన మహిళల్లో ఆమె ఒకరు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంలో 2019లో తొలిసారి నిర్మలమ్మ ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి.. ఇప్పటికీ అదే పదవిలో కొనసాగుతున్నారు. ఆర్థికమంత్రిగా విమర్శలు వచ్చినా ఆమె దీటుగా జవాబిస్తున్నారు. ఓ రకంగా ఆమె మంచి వక్త కావడం కూడా కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా స్థానంలో ఆమె ఎంపిక సరైనదేనని అంటున్నారు. ఇకపోతే భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు, తమిళనాడు ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్1993 నుంచి భాజపాలో కొనసాగుతున్నారు. ఆమె 2021 ఎన్నికల్లో.. నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు అయిన కమల్ హాసన్‌ను ఓడించి కోయంబత్తూర్ (దక్షిణ) స్థానాన్ని గెలుచుకున్నారు. 2022లో భాజపా కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఆమె కూడా ఈరేసులో ఉన్నారు. తమిళనాడులో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇక్కడ పాగా వేసేందుకు బిజెపి కసరత్తు చేస్తోంది. అన్నామలైని తప్పించాలన్న డిమాండ్‌ను కూడా అంగీకరించింది. స్టాలిన్ ప్రభుత్వాన్ని సాగనంపే క్రమంలో ఈ ప్రయత్నాలు ఫలించ వచ్చని అంటున్నారు. ఒకవేళ ఇదే జరిగితే ఇతర పార్టీలకు ఇది ఓ చెంపపెట్టు కాగలదు. అలాగే బిజెపి చేస్తున్న కసరత్తు కూడా ప్రజల్లో ప్రభావం చూపగలదని భావిస్తున్నారు.

## ఆపరేషన్ సిందూర్... ముగ్గురితో యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

నిలిచాయన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఫిక్కీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఏజ్ మిలటరీ టెక్నాలజీస్ అనే అంశంపై లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన సమయంలో పాకిస్థాన్‌ను చైనా ఎప్పటికప్పుడు సమాయత్తం చేసింద న్నారు. భారత్‌కు ఒక సరిహద్దు.. ఇద్దరు శు త్రువులు ఉన్నారన్నారు. కానీ నిజానికి ముగ్గురు శత్రువులు అని ఆయన వివరించారు.

అందులో పాకిస్థాన్ ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు. పాకిస్థాన్‌కు చైనా అన్ని విధాలుగా మద్దతు ఇస్తుందన్నారు. పాకిస్థాన్ మిలటరీ వినియోగిస్తున్న హార్డ్‌వేర్‌లో 81 శాతం చైనాకు చెందినవేనని ఈ సందర్భంగా ఆయన సోదాహరణగా వివరించారు.

ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నడుమ భారత్‌పై పాక్ నిర్వహించిన దాడుల్లో చైనా తన ఆయుధాలను పరీక్షించుకుందని చెప్పారు. అదే సమయంలో పాకిస్థాన్‌కు టర్కీ సైతం అదే తరహాలో సహాయం చేసిందన్నారు. ఈ యుద్ధంలో టర్కీ పైలట్లు నేరుగా పాల్గొన్నారని వివరించారు. పాక్, చైనాను ఎదుర్కొవడానికి బలమైన వాయు రక్షణ వ్యవస్థ ఉండాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాద స్థావరాలను గుర్తించి.. వాటిని ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించిన భారత సైనిక బలగాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అలాగే ఈ ఆపరేషన్ సిందూర్ వల్ల కొన్ని పాఠాలను సైతం నేర్చుకున్నామని చెప్పారు. మానవ మేథస్సుతో పాటు సాంకేతిక ద్వారా లెక్కలేనంత సమా చారాన్ని సేకరించి.. ఈ దాడులు నిర్వహిం చామని లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ వివరించారు.

గతంలో మాత్రం ఇలా సమాచారాన్ని సేకరించడంలో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్న మాట మాత్రం వాస్తవమన్నారు. అయితే పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో 21 లక్ష్యాలను గుర్తించి.. వాటిలో తొమ్మిది స్థావరాలను ధ్వంసం చేశామన్నారు. అందుకు చివరి రోజు.. చివరి నిమిషంలో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు. త్రివిధ దళాలు ఐక్యత కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. ఎప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని పహల్గంలో పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించారు. ఈ ఘటనకు తామే బాధ్యులమంటూ లష్కరే తోయిబాకు చెందిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించింది. దీంతో ఈ ఘటనకు కర్త, కర్మ, క్రియా అంతా పాకిస్థాన్ అని భారత్ నమ్మింది. దీంతో పాక్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అదే సమయంలో పాక్ సైతం భారత్‌కు వ్యతిరేకంగా పలు నిర్ణయాలు తీసుకుంది.


ఇక పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించింది.

ఆ క్రమంలో తొమ్మిది స్థావరాలను ధ్వంసం చేసి.. 100 మందికి పైగా ఉగ్రవాదులను హత మార్చిన సంగతి తెలిసిందే.

## కాళేశ్వరం వద్ద ప్రాణహిత ఉధృతి

### మహారాష్ట్ర నుంచి భారీగా వస్తున్న వరదనీరు

**జయశంకర్ భూపాలపల్లి,జూలై4(వార్త వేదిక సూర్య):** కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది మరోసారి ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో నదికి వచ్చే వరద నీటి ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక వ్యాపార స్థలాలు పూర్తిగా నీట మునిగాయి. ఇప్పటి వరకు నీటి కొరతతో వెలిసిన నదీ తీరంలో గుడారాలు వేసుకుని వ్యాపార కార్యకలాపాలు సాగించిన స్థానికులు, వరద ఉధృతికి అవన్నీ కోల్పోయారు. మరోవైపు, నీటి ఉధృతి ఉన్నా కూడా భక్తులు పుణ్యస్నానాల కోసం నదిలోకి దిగుతున్న దృశ్యాలు అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో భక్తులు నదిలోకి ప్రవేశించడం పట్ల అధికారులు అప్రమత్తమవు తున్నారు. వరద ప్రవాహం పెరగడంతో నది పక్కన ఎలాంటి శాశ్వత ఏర్పాట్లు లేకపోవడం వల్ల, ప్రజలకు అవగాహన కల్పించేం దుకు సిబ్బందిని మోహరించారు.



ఇక ఎగువ మహారాష్ట్ర నుంచి వస్తున్న భారీ వరద నీరు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీకి చేరుతోంది. ప్రస్తుతానికి బ్యారేజీకి పై నుంచి సుమారు 84,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 85 గేట్లను ఎత్తి, అదే స్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద ఇన్‌ఎలో, అవుట్‌ఎలో సమానంగా కొనసాగుతున్న నేపథ్యంలో, దిగువన ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ వరద ఉధృతికి సంబంధించి జిల్లా పాలన యంత్రాంగం ఇప్పటికే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. లోతట్టు ప్రాంతాలపై నిఘా పెట్టి, అవసరమైతే స్థానికులను ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


వరద స్థాయిలను గమనిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. భక్తులు కూడా నదిలోకి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.




# ఫోన్ పేలి యువకుడికి గాయాలు

మైలర్‌దేవ్‌పల్లి, 04 జులై (వార్త వేదిక సూర్య): రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్, అత్తాపూర్ ప్రాంతంలో శ్రీనివాస్ అనే యువకుడు తన ప్యాంటు జేబులో ఉన్న వివో (వివో) మొబైల్ ఫోన్ వేడెక్కి మంటలు చెలరేగడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీనివాస్ తన మొబైల్‌ను జేబులో పెట్టుకుని వస్తుండగా, ఒక్కసారిగా ఫోన్ వేడెక్కి మంటలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమై ఫోన్‌ను బయటికి తీసినా అప్పటికే ఆలస్యమైంది. ఫోన్ వేడికి శ్రీనివాస్‌కు కాలు తీవ్రంగా కాలిపోయింది. శ్రీనివాస్ వృత్తి రీత్యా పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే అతన్ని స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. అతనికి చికిత్స అందించిన డాక్టర్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... శ్రీనివాస్ కాలుపై భాగంలో ఉన్న చర్మం కాలిపోయి, కింది పొర వరకు దెబ్బతిందని తెలిపారు. మరింత అప్రమత్తంగా ఉండకపోయి ఉంటే, మంటలు చర్మం పొరతో పాటు కండరాల్లోకి కూడా వ్యాపించి తీవ్రమైన నష్టం జరిగేదని డాక్టర్ వివరించారు. మొబైల్ ఫోన్‌ల వల్ల ఇలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలి. మీ ఫోన్‌లో ఏమైనా అసాధారణమైన వేడి లేదా లీకేజీ గమనిస్తే వెంటనే దాన్ని వాడటం ఆపివేయండి అన్నారు.





# పేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

మైలర్‌దేవ్‌పల్లి, 04 జులై (వార్త వేదిక సూర్య): రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులకు చెక్కులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మొత్తం 501 లబ్ధిదారులకు చెక్కులు అందించగా, అందులో 426 మంది షాదీ



ముబారక్ లబ్ధిదారులు కాగా, 75 మంది కళ్యాణలక్ష్మి లబ్ధిదారులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివాహ సహాయం పథకాలు ఎంతో మందికి ఆర్థికంగా ఉపయోగపడు తున్నాయి. పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఈ పథకాలు సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయి. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా మారింది,అని అన్నారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# క్రిస్టియన్ మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

మైలర్‌దేవ్‌పల్లి, 04 జులై (వార్త వేదిక సూర్య): ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి పథకం రేవంతన్న భరోసాలో భాగంగా క్రిస్టియన్ మహిళా సోదరీమణులకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఈ పథకం కింద 20 మంది లబ్ధిదారులకు కుట్టుమిషన్లు





అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... మహిళలకు స్వయం ఉపాధి కల్పన, ఆర్థిక స్వావలంబనయే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల పక్షపాతి అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాహితీ హాస్పిటల్ ఆధ్వర్యంలో

# నేడు రక్తదాన శిబిరం

సంగారెడ్డి,04 జులై (వార్త వేదిక సూర్య): సంగారెడ్డి పట్టణంలోని రైతుబజార్ ఎదురుగా ఉన్న సాహితీ హాస్పిటల్ ఆధ్వర్యంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సాహితీ రాము జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు . ఈ శిబిరాన్ని టీజీఐసీ చైర్మన్ నిర్మల జయ ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవు తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ రాము మాట్లాడుతూ






మాట్లాడుతూ, "రక్తదానం మహత్తరమైన సేవ. ప్రతి ఆరోగ్యవంతుడు సంవత్సరానికి కనీసం ఒక్కసారి రక్తదానం చేయాలని" ప్రజలకు పిలుపునిచ్చారు. సాహితీ హాస్పిటల్ తీసుకుంటున్న సామాజిక బాధ్యతల చర్యలు అభినందనీయమని తెలిపారు. హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ, రక్తం అవసరమైన వారి ప్రాణాలను రక్షించడంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందని, ఆసక్తి ఉన్న దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయవచ్చని కోరారు.

# ఆరోగ్య శ్రేయస్సు కోసం అంగన్‌వాడీ టీచర్ల ముందడుగు

### పిల్లల పోషకాహారంపై అంగన్‌వాడీ ప్రత్యేక దృష్టి

### చిన్నారులపై ప్రేమతో సేవ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ కూడికల రాజేశ్వరీ

మైలర్‌దేవ్‌పల్లి, 04 జులై (వార్త వేదిక సూర్య): రాజేంద్రనగర్ సర్కిల్, శేర్లింగంపల్లి ప్రాజెక్ట్ మైలార్‌దేవ్‌పల్లి సెక్టార్‌లోని పద్మశాలిపురం అంగన్‌వాడీ సెంటర్-1లో శుక్రవారం బరువు తక్కువగా ఉన్న చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ కూడికల రాజేశ్వరీ చిన్నారులకు బాలామృతంం, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారుల బరువు, పొడవు కొలతలు



తీసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన ఆవశ్యకతను ఆమె వివరించారు. ఈ సందర్భంగా టీచర్ రాజేశ్వరీ మాట్లాడుతూ...

"బరువు తక్కువగా ఉన్న పిల్లల ఆరోగ్యం మెరుగుపడేందుకు పోషకాహారం అందించటం అనేది ప్రధాన లక్ష్యం. బాలామృతంంలో ఉన్న మైక్రో న్యూట్రియెంట్లు చిన్నారుల అభివృద్ధికి సహాయపడతాయి. తల్లిదండ్రులు పిల్లల డైట్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని పేర్కొన్నారు.అంగన్వాడీ కేంద్రంలో ఇటువంటి కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తూ, చిన్నారుల ఆరోగ్య పర్యవేక్షణ చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్పర్ మంగ దేవి, అక్షిత, స్వాతి, శ్రీ దుర్గవల్లి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

జిన్నారం,04 జులై (వార్త వేదిక సూర్య): ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోల్డ్ టెక్ కంపెనీ సహకారంతో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న రెండు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు అత్యధికంగా విద్యను అభ్యసించే. ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు.



విద్యతోపాటు క్రీడారంగంపై ఆసక్తి పెంపొందించేలా ప్రతి పాఠశాలలో మైదానాలను ఏర్పాటు చేస్తూ వివిధ క్రీడలకు సంబంధించిన కోర్టులు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై వేలాది రూపాయలు ఖర్చు చేస్తోందని.. జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్న లక్ష్యంతో చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, బాల వికాస్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరి రెడ్డి, గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, నవనీత్ రెడ్డి, రవీందర్, పరిశ్రమ ప్రతినిధులు, స్థానిక నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సంగారెడ్డి సెంట్రల్ జైలు కంది నందు జిల్లా న్యాయ

# సేవాధికార సంస్థ కార్యదర్శి ఆకస్మిక సందర్శన

సంగారెడ్డి, 04 జులై (వార్త వేదిక సూర్య): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలతో జిల్లా న్యాయ సేవ్షాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య సెంట్రల్ జైలు కంది నందు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీ నందు న్యాయమూర్తి సెంట్రల్ జైలు నందు ఉన్న బెరక్లూ, గదులు, వంట గది, మరియు బాత్రూంలు జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించి ఖైదీలను జైలులో ఉన్న సదుపాయాలను, భోజనం గూర్చి అడిగి తెలుసుకున్నారు అన్ని ఖైదీలు బెరక్లూ క్షున్నంగా పరిశీలించి వారికీ కావాల్సిన అవసరాలు, సదుపాయాలు అన్ని అందించేలా చూడాలని జైలు సూపరింటెండెంట్ కి తెలియజేసారు. మరియు వారికీ ఖైదీలతో వారికీ సమయానికి బైల్స్, ములాఖత్ అందుతున్నాయ,కేసులు పరిష్కరించేందుకు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని ఖైదీలకు తెలియపరిచారు. మరియు ఖైదీలకు పెడుతున్న భోజనం రుచి చూడడం జరిగినది ఖైదీల కోసం వన్డే కూరగాయలు, బియ్యం, ఉన్న రూమ్ ని కూడా తనిఖీ చేయడం జరిగింది. జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్ కూడా పరిశీలించారు. ఈ తనిఖీ నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య , జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా రోశయ్య జయంతి

నల్లగొండ,జూలై 4(వార్తా వేదిక సూర్య): బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రముఖ ఆర్థికవేత్త ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగ గవర్నర్గా పనిచేసిన కీర్తిశేషులు కొనిజేటి జయంతి కార్యక్రమాన్ని నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తేలుకుంట్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 18 సార్లు జనరంజకమైన బడ్జెట్ పెట్టారని ముఖ్యమంత్రిగా గవర్నర్గా ఆయన ప్రజలకు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. రోశయ్య ఆర్యవైశ్య జాతిలో పుట్టడం ఆర్యవైశ్యులకు గర్వ కారణమన్నారు .ఆయన విగ్రహాన్ని నల్లగొండలో ఏర్పాటు చేయడానికి ఆర్యవైశ్యులంతా కృషి చేయాలని. అలాగే జిల్లా కేంద్రంలో ఉన్న ఆర్యవైశ్య సంఘం భవనాన్ని విస్తరించి ఆధునికరించడానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కమిటీని కోఆర్డినేషన్ కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు.

భవన నిర్మాణ కమిటీ చైర్మన్గా ఊరే లక్ష్మణ్ కోఆర్డినేషన్ మెంబర్గా తేలుకుంట్ల జానయ్యను నియమిస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం బలోపేతం చేయడానికి సభ్యత్వ శాఖలను ముమ్మరంగా చేస్తున్నామన్నారు .అన్ని మండలాలలో మండల కమిటీలు వేస్తున్నామని తెలిపారు. రోశయ్యను ఆదర్శంగా తీసుకొని ఆర్యవైశ్య యువత



రాజకీయాలలో రాణించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీశెట్టి శ్రీనివాస్, తక్షణ మాజీ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు ,మాజీ అధ్యక్షులు వీరేలు కృష్ణయ్య., ఆర్యవైశ్య నాయకులు కోటగిరి దైవ దినం, జిల్లా అదనపు కార్యదర్శి నాళ్ల వెంకన్న, బండారు వెంకటేశ్వర్లు., సోమచంద్రశేఖర్ ,నల్లగొండ ఆర్యవైసియాసంఘం పట్టణ అధ్యక్షుడు యామా మురళి తల్లంగిరి నల్లగొండ శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు.



# కొండమల్లేపల్లి గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ, జూలై 04(వార్త వేదిక సూర్య): కొండ మల్లెపల్లిలోని పలు సంక్షేమ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ముందుగా తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/ కళాశాలను సందర్శించి అక్కడున్న



విద్యార్థుల సంఖ్య ,వసతులు ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ అవసరమైన అదనపు మంచాలు, బాత్రూంలు, తాగునీటి వసతి, అదనపు తరగతి గదులు, డార్మేటరీ,తదితర వివరాలను కళాశాల ప్రిన్సిపల్ ద్వారా అడిగి తెలుసుకున్నారు.

ఆ తర్వాత తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపల్ శారదతో మౌలిక సదుపాయాల వివరాలను అడగగా ,మంచాలు కావాలని,తాగునీటి సమస్య ఉందని, 30 అదనపు టాయిలెట్లు కావాలని, బాత్రూంలు కావాలని, అలాగే ఓహెచ్ఎస్ఆర్ కావాలని, మిషన్ భగీరథ సమస్య ఉందని, తెలిపారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ కళాశాలకు సంబంధించిన ప్రహరీ ఇంకా పూర్తి కాలేదా అని అడిగారు. అనంతరం జిల్లా కలెక్టర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల/ కళాశాలను సందర్శించి అక్కడ కూడా మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు జిల్లా కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి ,ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల రీజినల్ కో-ఆర్డినేటర్ బలరాం నాయక్, తదితరులు ఉన్నారు.

## ముస్లిం సోదరి సోదరీమణులకు మొహరం పండుగ శుభాకాంక్షలు: సయ్యద్ రూహీ

సికింద్రాబాద్ జూలై 04(వార్త వేదిక సూర్య): ముస్లిం సోదరి సోదరీమణులకు మరియు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటిఎఫ్) రాష్ట్ర మహిళ సంయుక్త కార్యదర్శి, ఎంపిపిఎస్ ఆర్ కె పురం ఎస్జీటీ సయ్యద్ రూహీ మొహరం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆ యొక్క అల్లాహ్ ఆశీస్సులు ఎల్లపుడూ రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరి కుటుంబంలో మంచి జరగాలని పేర్కొన్నారు



## ఎల్బీ స్టేడియం సభకు భారీ ఎత్తున తరలిన సోమాజిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

సికింద్రాబాద్ జూలై 04(వార్త వేదిక సూర్య): మాజీ మంత్రి ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ పిలుపు మేరకు సోమాజిగూడ డివిజన్ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నగరంలోని ఎల్బీ స్టేడియంలో టిపిసిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల, డివిజన్ అధ్యక్షుల సమ్మేళనానికి భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. ఈ సమ్మేళనంలో తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన జై బాపు ,జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం, పోలింగ్ బూత్



స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, మరియు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకు వెళ్ళాల్సిన తీరుపై సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్న ఏఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు. ఈ సమ్మేళనం లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి తెలంగాణ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, రాష్ట్ర మంత్రులు ,ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మరియు రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనాయకత్వం పాల్గొంటున్నారు. ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయడం కోసం సోమాజిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళలుతో భారీగా తరలి వెళ్లారు.

**దేవరకొండ, జూలై 04(వార్త వేదిక సూర్య): హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో జరిగే సభకు దేవరకొండ నియోజకవర్గ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో సభకు హాజరయిన దేవరకొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కిన్నర**



**హరికృష్ణ మరియు చందంపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు..**

# 6న మండల కేంద్రంలో జరిగే బైక్ ర్యాలీ జయప్రదం చేయండి : సిఐటియు

**వలిగొండ, జులై 4 (వార్తా వేదిక సూర్య):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్ ల రద్దుకై జులై 9 జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 6 న మండల కేంద్రంలో జరిగే బైక్ ర్యాలీలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాదారపు మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో హమాలి కార్మిక సంఘం సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టం రద్దు చేసింది వాటి స్థానంలో



4 లేబర్ కోడ్ లు ను తీసుకవచ్చిందని. 1991 తర్వాత దేశంలో అమలు జరిపిన నూతన ఆర్థిక విధానాలు ప్రవేశపెట్ట పడ్డాయని. 2014 తర్వాత కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలను వేగవంతంగా అమలు చేస్తున్నదని వారు విమర్శించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు వాళ్ల ప్రయోజనాల కోసం, లాభాల కోసం కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసలుగా తయారు చేసేందుకే 4 లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా జులై 9 జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలి కార్మిక సంఘం మండల అధ్యక్షులు జన్ని జంగయ్య, మల్లేశం, కిష్టయ్య, ఐలయ్య, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# చేనేత సమస్యలు పరిష్కరించాలి : చేనేత కార్మిక సంఘం డిమాండ్

**తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు కర్నాటి మారయ్య, చేనేత పారిశ్రామికులు**

**సంస్థాన్ నారాయణపురం, జూలై 04(వార్త వేదిక సూర్య):** సంస్థాన్ నారాయణపురం సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను గట్టెక్కించేందుకు ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు కర్నాటి మారయ్య ప్రభుత్వాన్ని కోరుతూ సంస్థాన్ నారాయణపురం తహసీల్దార్ కు వినతి పత్రం శుక్రవారం అంద జేశారు. సంస్థాన్ నారాయణ పురానికి మూడేళ్ల క్రితం చేనేత క్లస్టర్ కు మంజూరైన రూ.75 లక్షలు వెంటనే విడుదల చేసి పనులు చేపట్టాలని కోరారు. సంస్థాన్ నారాయణపురం చేనేత సహకార సంఘంలో 390 మంది సభ్యులు ఉన్నారని, వారు ఏడాదికి 5000 పట్టు చీరలు ఉత్పత్తి చేయగలరని తెలిపారు.

ఆ చీరలను టెస్కో ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రొక్యూర్మెంట్ ఆర్డర్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక చేనేత సహకార సంఘానికి నాబార్డు ద్వారా రూ. 18 లక్షలు క్యాష్ క్రెడిట్ మాత్రమే ఇచ్చారని అది పెట్టుబడికి సరిపోనందున రూ.ఒక కోటికి పెంచాలని, క్యాష్ క్రెడిట్ రుణాన్ని మాఫీ చేయాలని కోరారు. చేనేత మగ్గాలన్నింటికీ జియో ట్యాగ్ చేయించాలని, చేనేత పొదుపు పథకంలో గతంలో



మాదిరిగా ముగ్గురు అనుబంధ కార్మికులకు అవకాశం ఇవ్వాలని, 40% నూలు రాయితీ పథకాన్ని పునరుద్ధరించాలని, జియో టాక్ ఉన్న ప్రతి మగ్గానికి లక్ష చొప్పున వడ్డీ లేని రుణం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ వినతి పత్రాలను ముఖ్య మంత్రికి, చేనేత జౌళిశాఖ మంత్రికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు పంపినట్టు ప్రకటించారు. కార్యక్రమంలో చేనేత పారిశ్రామికులు పగిడిమర్రి విష్ణు, సురపల్లి జనార్ధన్, గంజి వెంకటేశం, గంజి శీను, రాములు, అంజయ్య, చెరుపల్లి లక్ష్మయ్య, అంజయ్య, దోర్నాల శ్రీనివాస్, సింగం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల ఆశయాల సప్నం దొడ్డి కొమురయ్య

**బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణం నర్సింహ్మా**

**సంస్థాన్ నారాయణపురం, జూలై 04(వార్త వేదిక సూర్య):** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం నాటి నిజాం నిరంకుశ పాలన పై మరియు దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారి, జాగిర్దార్ ల అరాచకాలపై, విసునూరు గుండాల మూకలపై వీరంగమాడిన, తూటాలకు బలైన నాటి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య గారి 79వ వర్ధంతి సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గణం నర్సింహ్మ కురుమ పాల్గొని మాట్లాడుతూ.

బాంచన్ కాల్మొక్తా అంటూ బతికిన తెలంగాణ బిడ్డలు.. బరిసెలు, బందూకులూ చేతబట్టి తెలంగాణ ప్రజలు చైతన్యవంతులై అటు దొరలూ, ఇటు నిజాం రాజు అకృత్యాలను ఎదుర్కొనడానికి పోరాటం మొదలుపెట్టారని. ఊరూరా, వాడవాడలా ఆంధ్ర మహాసభ శాఖలు విస్తరించాయని. ఆంధ్రమహాసభకు పల్లెజనం పెట్టిన పేరు "సంఘం". చేతులలో గుత్పలతో దొరల గుండాల



దౌర్జన్యాలను ఎదుర్కొనేవారు కాబట్టి ఆ సంస్థకు మరో పేరు "గుత్పల సంఘం". పెరు పెట్టారని ఆ సంఘానికి నాటి నల్లగొండ జిల్లా జనగామ తాలూకా కడివెండి గ్రామం ఓ ప్రధాన కేంద్రం అయిందని అన్నారు.

తెలంగాణ ప్రజలను అరిగోసలు పెడుతున్న దొరలలో పెద్ద దొర.. జనగామ తాలుకాకు చెందిన దేశ్ ముఖ్ విసునూరు రామచంద్రా రెడ్డి. విసునూరు దేశ్ముఖ్ ఆగడాలకు వ్యతిరేకంగా సంఘం అండతో ప్రజలు తిరగబడ్డారని అయిన అన్నారు.

1946 జులై 4న.. కడవెండి గ్రామ వీధుల్లో.. సంఘం జండాలతో ప్రజల ఊరేగింపు సాగిందని ఆ సమయంలో దొర గడీలో నక్కి దాక్కున్న గుండాలు ఊరేగింపుపై తుపాకులతో కాల్పులు జరపడంతో. ముందు వరుసలో ఉండి.. "సంగానికి జై" అంటూ నినదిస్తూ సాగుతున్న దొడ్డి కొమురయ్య ఆ తూటాలకు నేలకొరిగి ప్రాణాలు వదిలాడని అన్నారు.

కొమురయ్య అమరత్వంతో తెలంగాణ బిడ్డల పోరాటం సాయుధ రూపు సంతరించుకున్నది. గుత్పలు వదిలేసిన ప్రజలు తుపాకులు చేత బట్టి నిజాం రాజ్యాన్ని కూల్చడానికి.. దొరల రాక్షసత్వానికి గోరీ కట్టరన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏపూరి సతీష్, గీత పనివారల సంఘం జిల్లా నాయకులు పందుల యాదగిరి, తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి కాటేపల్లి వెంకటేశం గౌడ్, ఉప్పల గోపాలు, ఉప్పల నాగరాజు, చిలువేరు అంజయ్య, రేవనపల్లి గోపాల్, బోయ సత్యం, తదితరులు పాల్గొన్నారు

# దొడ్డి కొమురయ్య ఆశయాల సాధన కోసం పనిచేయాలి

**బట్టుపల్లి అనురాధ**
**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు**

**భువనగిరి,జూలై 04(వార్త వేదిక సూర్య):** దొడ్డి కొమురయ్య ఆశయాల సాధన కోసం పనిచేయాలని, దొడ్డి కొమరయ్య స్ఫూర్తిని తీసుకుని బిజెపి అవలంబిస్తున్న విధానాలపై పోరాడాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ గారన్నారు. శుక్రవారం రోజున సుందరయ్య భవనంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్యగా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించి ఆమె మాట్లాడుతూ



భూమికోసం భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం తొలి అమరుడు గా, దున్నేవాడికి భూమి , భూమి అందరికీ పంచాలని పోరాడారు, దున్నేవాడికే భూమి ఉండాలని పోరాట మార్గాన్ని ఎంచుకొని గ్రామ గ్రామాన వేలాదిమంది పాల్గొని నైజాం నవాబులను తరిమికొట్టడంలో కీలక భూమిక పోషించారని, వారి స్ఫూర్తిని తీసుకొని బిజెపి అవలంబిస్తున్న విధానాలపై పోరాటాలు నిర్వహించాలని, వారి ఆశయం సాధన కోసం కృషి చేయాలని, బిజెపి అవలంబిస్తున్న విధానాలపై పోరాడినప్పుడే దొడ్డి కొమరయ్య ఆశయ సాధన కోసం కృషి చేసేవాళ్ళం అవుతాం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు, మాయ కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సలీం, ఆఫీస్ కార్యదర్శి వల్లపుదాసు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయం

**ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు సోమయ్య**

**మోత్కూరు, జూలై 04 (వార్త వేదిక సూర్య):** పేద ప్రజల వర్గాల కోసం నిరంతర కృషి చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మొగుళ్లపల్లి సోమయ్య అన్నారు. శుక్రవారంనాడు మోత్కూరు ఆర్యవైశ్య భవనంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రోశయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసిఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 16 సార్లు ఆర్థిక శాఖ మంత్రి హెూదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఆయన దక్కించుకున్నారని గుర్తు చేశారు.ఆయన చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం అరుదైన గౌరవం సూచికంగా ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వివాద రహితుడుగా పేరు పొందిన రోశయ్య పేరును నేచర్ క్యూర్ ఆసుపత్రికి పెట్టడం ఎంతో సంతోషకర విషయమన్నారు.

ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ మాజీ అధ్యక్షులు సోమ వెంకటేశ్వర్లు, బుస్స శ్రీనివాస్, కోశాధికారి బుక్క విశ్వ నాథం, ప్రతినిధులు సోమ లింగయ్య, సోమ నర్సయ్య, మిట్ట పల్లి నగేష్, గౌరు సత్యనారాయణ, గౌరు శ్రీనివాస్, బుస్స రవి, అనంతుల వెంకటేశ్వర్లు, బండారు రాజేంద్రప్రసాద్, దారం సురేష్, దామేర సోమయ్య, అల్లాడి సోమేశ్వర్, మురారిశెట్టి శ్రీధర్, రాంపాక శంకర్, పందిరి వెంకటేశ్వర్లు, ఇమ్మడి రమేష్, సోమ మనిదీప్, మాశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# అరెస్ట్‌లతో ఉద్యమాలను ఆపలేరు..

**వి.ఆర్.పి జిల్లా అధ్యక్షులు నరేష్**

**మోత్కూరు,జూలై 04 (వార్త వేదిక సూర్య):** విద్యార్థి, నిరుద్యోగ సమస్యలపై ఆందోళన చేస్తే అర్ధరాత్రి రాష్ట్ర ప్రభుత్వం అరెస్ట్ చేస్తుందని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎడ్ల నరేష్ అన్నారు.

శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలపై తమ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 04న హైదరాబాద్‌లో ఆందోళన చేయడానికి వెళ్తారని మోత్కూరు పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని ఆయన త్రీవంగా ఖండించారు. అరెస్టు అయినా వారిలో ఆపార్టీ మండల అధ్యక్షులు మల్లెబోయిన మహేష్, పట్టణ నాయకులు అన్నెపు హరిబాబు. తదితరులు ఉన్నారు.





# పేదల పాలిటి పెన్నిధి, ప్రాణదాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**సంస్థాన్ నారాయణపురం, జూలై 04(వార్త వేదిక సూర్య):** మండలంలోని సర్వేల్ గ్రామంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయ నిధి పేద ప్రజలకు ఒక వరంగా మారింది మునుగోడు నియోజకవర్గం శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి వారి యొక్క సలహా సూచనల మేరకు ప్రతి పేదవాడికి న్యాయం చేసేలా ఆపదలో ఉండి ఆదుకునే వ్యక్తిత్వం గల మహానేత రాజ్ గోపాల్ రెడ్డి మునుగోడు నియోజకవర్గ ప్రజల సమస్యలను భుజంపై వేసుకొని అనునిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ముందుకు సాగుతున్న స్థానిక శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారి నేతృత్వంలో సర్వేల్ గ్రామానికి చెందిన చిలకరాజు మల్లయ్య 60,000/-, యం. మంజుల 40,000/-, చెరుకు నవ్య 20,000/-, బోయ. వంశీ 18'000/-, బాలగోని పరమేశ 17,000/- లబ్ధిదారులకు చెక్కులు గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. కార్యక్రమం ఉపాధ్యక్షులు సుక్క స్వామి, కోశాధికారి వీరమల్ల పెంటయ్య, కార్యదర్శి బోయ నర్సింహ, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు గుత్త శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మానుపాటి సతీష్ కుమార్, బాజా అంజయ్య, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు డైనమిక్ లీడర్ చిలకరాజు రాజు, సింగిల్ విండో డైరెక్ట్ పగిళ్ల యాదయ్య, చర్ల మహేష్ చిలకరాజు విజయ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక సాయం

**వలిగొండ, జూలై 04 (వార్తావేదిక సూర్య):** మండల పరిధిలోని రెడ్లరేపాక గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన23మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ కొరకు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుర్రం లక్ష్మారెడ్డి సౌజన్యంతో ఒక్కొక్క కుటుంబానికి




ఐదువేల రూపాయలు చొప్పున ఒక లక్ష పదిహేను వేల రూపాయలును లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నోముల మల్లేష్,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,సిరికొండ జహంగీర్,పంతంగి రాజు, కందుల శ్రీను,కొండం అశ్విన్ కుమార్,కమ్మంపాటి రమేష్,నల్లమాస దయాకర్, బందారపు నరేష్, సుంకరి కృష్ణ, లింగస్వామి, జువ్వగాని కమలమ్మ, జయమ్మ, కమలమ్మ, లింగమ్మ, వెంకటమ్మ, లావణ్య, అలివేలు తదితరులు.

# ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి

**బొమ్మలరామారం, జూలై 4(వార్తా వేదిక సూర్య):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి , దివంగత నేత కే.రోశయ్య జయంతిని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ




కార్యక్రమంలో ఎంపీడీవో వి.రాజా త్రివిక్రమ్ , పర్యవేక్షకులు జి. జ్ఞాన ప్రకాష్ రెడ్డి ,పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం, యాదగిరిగుట్ట


**తేదీ : 04/07/2025, శుక్రవారం**

**శ్రీస్వామి వారి ఆదాయము రూ: 12,15,624/-**

**శ్రీ స్వామి వారికి 270 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.**

| | | |
|---|---|---|
| కళ్యాణ కట్ట | - | 13500/- |
| ప్రధాన బుకింగ్ | - | 68,050/- |
| కైంకర్యములు | - | Nill |
| సుప్రభాతం. | - | 5000/- |
| బ్రేక్ దర్శనం. | - | 90,900/- |
| వ్రతాలు | - | 27,200/- |
| వాహన పూజలు | - | 6,100/- |
| VIP దర్శనం | - | 90,000/- |
| ప్రచారశాఖ | - | 9,000/- |
| పాతగుట్ట | - | 5400/- |
| కొండపైకి వాహన ప్రవేశం | - | 2,10,500/- |
| యాదఋషి నిలయం | - | 24,040/- |
| సువర్ణ పుష్పార్చన | - | 39,200/- |
| శివాలయం | - | 16,650/- |
| శాశ్వత పూజలు | - | 15,000/- |
| పుష్కరిణి | - | 500/- |
| ప్రసాదవిక్రయం | - | 4,69,580/- |
| లాకర్స్ | - | 160/- |
| అన్నదానం | - | 29,564/- |
| ప్రసాద వితరణ | | 6,000/- |
| లీజెస్ | - | 89,680/- |
| ఇతరములు | - | Nill |








## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వెంకటేశ్వర్ రెడ్డి

**భూదాన్ పోచంపల్లి, జూలై 4(వార్తా వేదిక సూర్య):** మండలంలోని పిల్లాయిపల్లి గ్రామం మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ మండల నాయకుడు అందెల హరీష్ యాదవ్ తండ్రి అందెల బాలయ్య యాదవ్ ఇటీవల మృతి చెందారు. శుక్రవారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి పిల్లాయిపల్లిలో మృతుడి స్వగృహానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ప్యాట చంద్ర శేఖర్ , పార్టీ జిల్లా నాయకులు కుతాడి సురేష్, బిఆర్ఎస్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి కుతా టి మహేష్, మధు,కొమగోని శివాజీ,మోతే మనోహర్, యాట గణేష్,కొమ్మన బాలనర్సింహా, కాసుల శషిమోహన్ తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్వీ నాయకులు ముందస్తు అరెస్ట్

**గట్టుప్పల, జూలై 4,(వార్తా వేదిక సూర్య):** జాబ్ క్యాలెండర్ రిలీజ్ బిఆర్ఎస్వీ నోటిఫికేషన్స్ ఇవ్వాలంటూ బీఆర్ఎస్ నాయకులు చలో సెక్రటేరియట్‌కు పిలుపు నివ్వడంతో గట్టుప్పల మండలంలోని పలువురు బిఆర్ఎస్వీ యువ నాయకులని పోలీసులు అరెస్టు చేశారు. బీఆర్ఎస్వీ నాయకులు ఖమ్మం రాజశేఖర్ మాట్లాడుతు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గ్ గారి పర్యటన సందర్బంగా



పోలీస్‌లు బిఆర్ఎస్వీ నేతల ముందస్తు అరెస్ట్ ను కండిస్తూ, బిఆర్ఎస్వీ నాయకులను అరెస్ట్ చేయడం విడ్డురం అని అన్నారు. రాష్ట్రంలో విద్యార్థి, నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చలేని ప్రభుత్వం ఇలాంటి అరెస్ట్‌లతో ఎన్ని రోజులు కాలం గడుపుతుందని ప్రశ్నించారు. వెంటనే నిరుద్యోగులకు ఇస్తా అని చెప్పిన నిరుద్యోగ భృతి, విద్యార్థులకు పీజు రియాంబర్స్మెంట్ స్కాలర్ షిప్ లను విడుదల చేయాలనీ రాష్ట ప్రభుత్వంని డిమాండ్ చేసారు .అరెస్టయిన వారిలో బిఆర్ఎస్వీ గ్రామ కార్యదర్శి చిలువేరు అయోధ్య రుద్ర, దుబ్బాక కుమార్, తదితరులు ఉన్నారు.

## ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి

**బొమ్మలరామారం, జూలై 4,(వార్తా వేదిక సూర్య):**
తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో మండల సిపిఐ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల పార్టీ కార్యదర్శి



అన్నేమైన వెంకటేశం మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య పేద ప్రజల కోసం, భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను స్ఫూర్తిని ప్రపంచానికి చాటారన్నారు. తెలంగాణ రైతంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ కార్యదర్శి దార్ల మమత ,మండల కమిటీ సభ్యులు కైరం కొండ ఆనంద్, ఏడుజర్ల సాయిలు, పల్లపు మల్లేష్ పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్య ఆశయాలను ముందుకు తీసుకువెళ్దాం

**బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల అశోక్**

**భువనగిరి, జూలై 4(వార్తా వేదిక సూర్య):**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 79 వ వర్ధంతి శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల అశోక్ మాట్లాడుతూ1944 భువనగిరి ఆంధ్ర మహాసభలో రావి నారాయణరెడ్డి పిలుపుతో కడవెండి గ్రామం అగ్నిశికగా మారిందని నిజాం నిరంకుశ రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని గుర్తు చేశారు.వెట్టి చాకిరి దౌర్జన్యాలకు భూస్వామ్య



దోపిడీకి వ్యతిరేకంగా భూమి కోసం భుక్తి కోసం సామాజిక న్యాయం కోసం కష్టానికి తగిన ఫలితం కోసం జరిగిన పోరాటంలో ముందుండి తుపాకుల తూటాలకు బలైన దొడ్డి కొమరయ్య చిరస్మరణీయులని కొనియాడారు. ఆయన అందించిన స్ఫూర్తితో పోరాటం ఉధృతంగా జరిగి విజయవంతంగా రాచరిక పాలన అంతమై హైదరాబాద్ సంస్థానం భారత్లో విలీనమైందని అన్నారు.ఈ వర్ధంతి కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు సోమన సబిత సిపిఐ మండల మరియు పట్టణ కార్యదర్శులు దాసరి లక్ష్మయ్య పుట్ట రమేష్ నాయకులు కోర సామేలు పాల్గొన్నారు.



## శ్రీకాంత్ చౌరస్తా (చెరువుకట్ట) నుండి కొత్త బస్టాండ్ వరకు ఫుట్‌పాత్, మోరీలు నిర్మించాలి

**మోత్కూరు, జూలై 04 (వార్త వేదిక సూర్య):**
మోత్కూరు పట్టణ కేంద్రంలోని శ్రీకాంత్ చౌరస్తా (చెరువుకట్ట) నుండి కొత్త బస్టాండ్ వరకు ఫుట్ పాత్, మోరీలను ఇరువైపులా నిర్మించాలని కొత్త బస్టాండ్ 2వ,వార్డు ప్రజలు కోరారు. శుక్రవారం నాడు ఈ మేరకు మున్సిపల్ కమీషనర్ కే.సతీష్ కుమార్‌కు రెండో వార్డు ప్రజలు వింత పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అంబేద్కర్ చౌరస్తా నుండి చెరువు కట్ట వరకు ఫుట్ పాత్, మోరీలు నిర్మించి తమ వార్డు పరిధిలో ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. పట్టణ ప్రజలతో పాటు తాము కూడా మున్సిపల్ టాక్సీ అన్నింటిని కడుతున్నామని, తమ వైపు వివక్ష చూపడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి 2వ, వార్డ్ పరిధిలో ఇరువైపుల ఫుట్ పాత్ లు, మోరీలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

నిర్మాణాలు చేపట్టని యెడల తాము ఆందోళన చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో 2వ,ప్రజలు లింగంపల్లి రఘు వర్ధన్ రావు, గొడిశాల వెంకన్న, ఎం.డి.మైబెల్లి, ఎస్ నర్సయ్య, ఉపేందర్, రమేష్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ సదుపాయాలు ప్రచారం చేసి అడ్మిషన్లు పెంచాలి

**- కలెక్టర్ హనుమంతరావు**

**యాదాద్రి భువనగిరి, జూలై 4(వార్తా వేదిక సూర్య):**
ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచి విద్యనభ్యసించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం భువనగిరి పట్టణ శివారులోని మైనారిటీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో టీచర్స్, లెక్చరర్స్, సిబ్బంది యొక్క అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు సాయంత్రం అందించే స్నాక్స్ ని పరిశీలించారు.హాస్టల్ కిచెన్‌ను తనికి చేసి నూతన మెనూ ప్రకారం విద్యార్థులకి భోజనం పెడుతున్నారా లేదా అని హాస్టల్ వార్డెన్‌ని అడిగి తెలుసు కున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందజేయాలన్నారు. కిచెన్‌లో నిల్వ ఉన్న కూరగాయలను వెంటనే తీసివేసి , కూరగాయలు ఎప్పటికపుడు తాజాగా తెచ్చి వండాలని అన్నారు.

పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయా లేవా అని సంబంధిత అధికారిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని చెపుతూ ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు తెలియజేస్తూ అడ్మిషన్‌లు పెరిగేలా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## ఎమ్మెల్యేకు నిరసనగా రోడ్డు మరమ్మతులు చేపట్టిన బిఆర్ఎస్

**యాదాద్రి భువనగిరి, జూలై 4(వార్తా వేదిక సూర్య):**
రోడ్డు మరమ్మతు పనులు తక్షణమే చేపడుతానని హామీ ఇచ్చి పట్టించుకోకుండా ప్రమాదాలకు ఎమ్మెల్యే కుంభం కారణ మయ్యారని టిఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. తామే ప్రజల కోసం రోడ్డు పనులు చేపడతామంటూ ఆ పార్టీ




నాయకులు శుక్రవారం నాడు రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి రోడ్డు మరమ్మత్తులను చేపట్టారు. భువనగిరి పట్టణము నుండి జగదేవ్పూర్‌కు వెళ్లే జాతీయ రహదారి పై ఆర్కే హాస్పిటల్ ముందు గత కొంతకాలంగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రోడ్డుకు ఇరువైపులా పగుళ్లు ఏర్పడ్డాయి.

ప్రమాదకరంగా మారిన ఆ రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు పలుసార్లు ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఎన్నో ఉన్నాయి. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేకు ప్రజలు, తమ పార్టీ నాయకులు పలుసార్లు విజ్ఞప్తి చేశారు. అయినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వేయించారని ఆరోపించారు. ఎమ్మెల్యే పర్యటనలకి పరిమితం అవుతూ ఉన్నారు తప్ప పనులు చేయడం లేదని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కాజా అజీముద్దీన్, నాగారం సూరజ్ ఎండి బుజీబ్ రామకృష్ణ వేముల కృష్ణ మనీష్ పాకల శివ సైదులు బ్రౌన్ శ్రవణ్ విక్రాంత్ వసీం వినోద్ పవన్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.



## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న చింతల వెంకటేశ్వర్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి, జూలై 4(వార్తా వేదిక సూర్య):**
భువనగిరి పట్టణంలోని హనుమాన్ వాడ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయ చైర్మన్ కుక్కదువు కృష్ణ తల్లి స్వర్గీయ కుక్కదువు గౌరమ్మ దశదిన కార్యక్రమం శుక్రవారం నాడు వారి స్వగృహంలో జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని గౌరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులైన కుక్కదువు సోమయ్య, నరముల శ్రీనివాస్ యాదవ్,మేడబోయిన రాజు,. బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుతాడి సురేష్,,కుక్కదువు శ్రీనివాస్, కుక్కదువు సునీల్,మోతే మనోహర్, యాట గణేష్ లు పాల్గొని నివాళులర్పించారు.



## దొడ్డి కొమురయ్య సేవలు చిరస్మరణీయం..

**మోత్కూరు, జూలై 04 (వార్త వేదిక సూర్య):**
పేదల పక్షాన నిరంతర కృషి చేసిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య సేవలు చిరస్మరణీయమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు దొడ్డి కొమురయ్య 79వ, వర్ధంతి సందర్భంగా సిపిఐ కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి అన్నెపు వెంకట్, సహాయ కార్యదర్శి పులకరపు మల్లేశం, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, పట్టణ కార్యదర్శి బోయిని ఉప్పలయ్య, సహాయ కార్యదర్శి గొలుసుల యాదగిరి, స్థానిక నాయకులు కడమంచి వీరస్వామి, తాడూరు లక్ష్మీ నర్సయ్య, అన్నెపు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూరు సీఐ వెంకటేశ్వర్లులను మర్యాద పూర్వకంగా కలిసిన భా.జ.పా.నాయకులు

**మోత్కూరు, జూలై 04 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మండల పోలీస్ స్టేషన్ లో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్.హెచ్. ఓ , (సి.ఐ.) వెంకటేశ్వర్లు లను భా.జ.పా మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు గుదే మధుసూదన్



యాదవ్ తెలిపారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఒక్క మొక్కను సి.ఐ.తో కలిసి నాటారు. ఈ కార్యక్రమంలో భా.జ.పా పట్టణ మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య, మండల ప్రధాన కార్యదర్శులు పైళ్ళ సతీష్, వేముల దశరథ, కార్యదర్శి బత్తిని సతీష్, మండల నాయకులు అండెం సుధాకర్ రెడ్డి, చింతల నర్సిరెడ్డి, నల్ల పోగుల వెంకటేష్, కడమంచి సైదులు, అన్నెపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీ స్టేడియంకి బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

**మోత్కూరు, జూలై 04 (వార్త వేదిక సూర్య):** హైదరాబాద్ పరిధిలోని ఎల్బీ స్టేడియంలో జై బాపు, జై భీమ్, జై సవిందాన్ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మోత్కూరు మండల, పట్టణ



కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు.ఈ కార్యక్రమానికి బయలుదేరిన వారిలో యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, బూత్ స్థాయి ఎన్రోలర్స్ బందెల రవి, సుంకిశాల అనిల్ , నోముల రమేష్ నేత, పాలోజు శేఖరచారి, గనగాని నగేష్, కూరెళ్ల ఉప్పలయ్య, తొంట యాదగిరి తదితరులు పాల్గొన్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో... ఎల్బీ స్టేడియం జరగనున్న ఆత్మీయ సమ్మేళనానికి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు గౌడ్, మాజీ సర్పంచ్ సూదగాని పాండు , మాజీ ఉపసర్పంచ్ ఎడ్ల భగవంత్, చిరుమర్తి యాదయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మోత్కూరు, జూలై 04 (వార్త వేదిక సూర్య):**
ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమీషనర్ కే సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం నాడు మోత్కూరు మున్సిపల్ పరిధిలోని 6వ, వార్డులో వందరోజుల ప్రణాళికలో భాగంగా తడి, పొడి




హానికరమైన చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ శ్రవణ్ కుమార్, శానిటేషన్ సూపర్వైజర్ వీరస్వామి, ఆర్.పి.లు పారిశుద్ధ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com

వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY










## హైదరాబాద్ తరలి వెళ్ళిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**దేవరకొండ, జూలై 04(వార్త వేదిక సూర్య):** నేడు హైదరాబాద్ ఎల్ బి స్టేడియంలో జరుగుతున్న "కాంగ్రెస్ పార్టీ మండల, అధ్యక్షులు గ్రామ అధ్యక్షులు మరియు కార్యవర్గ సభ్యుల సమ్మేళనం" కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి హైదరాబాదుకు బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

## లాలు నాయక్ సేవలు చిరస్మరణీయం

**పేద ప్రజల పక్షపాతి లాలు నాయక్**

**మాజీ దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

**దేవరకొండ, జూలై 04(వార్త వేదిక సూర్య):** లాలు నాయక్ చేసిన సేవలు చిరస్మరణీయం అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు .శుక్రవారం చందంపేట మండలం బిల్డింగ్ తండా వద్ద రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రమావత్ లాలు నాయక్ 5వ వర్ధంతి సందర్భంగా లాలూ నాయక్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ




సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల పక్షపాతి లాలు నాయక్ అని ఆయన కొనియాడారు. లాలు నాయక్ కుటుంబానికి అండగా ఉంటానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జర్పుల లోక్య నాయక్, కేతావత్ శంకర్ నాయక్, రమావత్ మోహన్ కృష్ణ, రమావత్ రమేష్, శోభన్,తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని కొనసాగించలేరు

**-బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు రమావత్ దామోదర్ నాయక్**

**-నిరుద్యోగులు చలో సెక్రటేరియట్‌కి పిలుపునిచ్చిన నేపథ్యంలో బిఆర్ఎస్ నాయకులు అరెస్ట్**

**దేవరకొండ, జూలై 04(వార్త వేదిక సూర్య):** దేవరకొండ నియోజకవర్గం పీఏ పల్లి మండలంలో గుడిపల్లి పోలీస్ స్టేషన్లులో బి ఆర్ ఎస్వి నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసిన అంతమాత్రాన ప్రభుత్వాన్ని కొనసాగించలేరు అని బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు రమావత్ దామోదర్ నాయక్ అన్నారు. శుక్రవారం నిరుద్యోగులు చలో



సెక్రటేరియట్ కి పిలుపునిచ్చిన నేపథ్యంలో బిఆర్ఎస్ యువజన విభాగం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలు నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నెరవేర్చకుండా నిరుద్యోగులను మోసం చేసినా రేవంత్ రెడ్డి అని ఆయన గుర్తు చేశారు.ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తా అని చెప్పిండో తక్షణమే జాబ్ క్యాలెండర్ ను ప్రకటించాలి. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి గారు నిర్బంధపాలన కొనసాగిస్తున్నాడు అని ఆయన తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో పలువురు బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు తదితరులు ఉన్నారు

## బిఆర్ఎస్వి నాయకులు అరెస్ట్

**దేవరకొండ, జూలై 04(వార్త వేదిక సూర్య):** దేవరకొండ నియోజకవర్గం డిండి మండలంలో శుక్రవారం నిరుద్యోగులు చలో సెక్రటేరియట్‌కి పిలుపునిచ్చిన నేపథ్యంలో బిఆర్ఎస్వి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలు నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నెరవేర్చకుండా నిరుద్యోగులను మోసం చేసినా రేవంత్ రెడ్డి అని ఆయన గుర్తు చేశారు.ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తా అని చెప్పిండో తక్షణమే జాబ్ క్యాలెండర్ ను ప్రకటించాలి. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి గారు నిర్బంధపాలన కొనసాగిస్తున్నాడు అని ఆయన తెలిపారు. అరెస్ట్



అయిన వారిలో బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు గుర్రం సురేష్, బుషిపాక సాయి తదితరులు ఉన్నారు

# అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని కొనసాగించలేరు

**-ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలు నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నెరవేర్చకుండా నిరుద్యోగులను మోసం చేసినా రేవంత్ రెడ్డి**

**-బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్**

**- నిరుద్యోగులు చలో సెక్రటేరియట్ కి పిలుపునిచ్చిన నేపథ్యంలో బిఆర్ఎస్వి నాయకులు అరెస్ట్**


**దేవరకొండ, జూలై 04(వార్త వేదిక సూర్య):** అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని కొనసాగించలేరు అని బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ




నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణలు అన్నారు. శుక్రవారం నిరుద్యోగులు చలో సెక్రటేరియట్‌కి పిలుపునిచ్చిన నేపథ్యంలో బిఆర్ఎస్వి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలు నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నెరవేర్చకుండా నిరుద్యోగులను మోసం చేసినా రేవంత్ రెడ్డి అని ఆయన గుర్తు చేశారు.ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తా అని చెప్పిండో తక్షణమే జాబ్ క్యాలెండర్ ను ప్రకటించాలి.

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి గారు నిర్బంధపాలన కొనసాగిస్తున్నాడు అని ఆయన తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు పాత్లవత్ లక్ష్మణ్, యువజన విభాగం అధ్యక్షుడు పొట్ట మధు , ఎస్.కె జామీర్ బాబా తదితరులు ఉన్నారు.




## జులై 6న యోగ సింధూర్ విజయోత్సవ సభ

**నల్లగొండ,జూలై 04(వార్త వేదిక సూర్య):** ఈనెల 6న హైదరాబాద్ గచ్చిబౌలిలోని టీహబ్ లో నిర్వహించనున్న యోగా సింధూర్ విజయోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణను మంత్రి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుక్రవారం నలగొండలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి యోగా ఎంతో అవసరం అని ఆరోగ్య భారత్ ఆధ్వర్యంలో యోగాసిందూర్ ఏర్పాటు చేసి లక్ష మందికి పైగా యోగా దినోత్సవం లో పాల్గొనడంతో పాటు సైనికులకు ఆర్థిక సహాయం చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. యోగా సింధూర్ అధ్యక్షుడు కే శివ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆదివారం జరిగే కార్యక్రమంలో యోగాలో నిష్ణాతులను సన్మానించి, విరాళాల ద్వారా వచ్చిన మూడు లక్షల 40 వేల రూపాయలను సైనికులకు అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కోమటిరెడ్డి ప్రతి ఫౌండేషన్ సీఈవో ఎంపీ గోన రెడ్డి యోగా సింధూర్ ఫౌండర్ డాక్టర్ యోగ నారాయణ విద్యుత్ శాఖ ఏడి రామడుగు శ్రీధర్, యోగ గురూజీలు రాపోలు వెంకటేశ్వర్లు, సింగం ప్రవీణ్ యాలాద్రి, కంది భజరంగ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తబావి గ్రామంలో టీబీ ముక్త్ భారత్ క్యాంప్ నిర్వహణ

**టీబీ నివారణకు ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాలి**

**ప్రతి ఒక్కరూ పౌష్టికమైన ఆహారాన్ని తీసుకోవాలి**

**దేవరకొండ, జూలై 04(వార్త వేదిక సూర్య):** కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొత్తబావి గ్రామంలో కొండమల్లేపల్లి పిహెచ్సి పరిధిలోని కొలుమంతల్ పహాడ్ సెక్టార్ పరిధిలో కొత్తబావి గ్రామంలో శుక్రవారం టీబీ ముక్త్ భారత్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ కే. రాణి మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ వంద రోజుల క్యాంపన్లో భాగంగా ఈరోజు కొత్తబావి ,అంఖ్యా తండా, కుమ్మరిగూడెం గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. టీబీ పాజిటివ్ లక్షణాలున్న వారిని గుర్తించి ఎక్స్రేకు, తెమడ పరీక్షకు దేవరకొండ ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ గ్రామంలో పరీక్షించిన వారిని 24 మంది ఎక్స్రేకు, 32 మంది స్పూటం టెస్ట్ కు పంపినట్లు పేర్కొన్నారు. ప్రజలు టీబి పై అవగాహన కలిగి ఉండాలని దగ్గు,తెమడ, ఆయాసం వంటివి



ఎక్కువ రోజులు ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు రావాల్సిందిగా సూచించారు. ప్రభుత్వం నుండి టీబి రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ఈ సందర్భంగా సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధు లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పి తేజస్విని, ఏఎన్ఎం సునీత, పద్మ ఆశా వర్కర్ జాల యాదమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో ఆల్ఫా స్కూల్ ముందు ధర్నా

- **బిఏఎస్ పిల్లలపై వివక్ష తగదు.. అందరిలాగే బుక్స్ ఇవ్వాలి ఒకే గదిలో కూర్చోబెట్టాలి**
- **స్కూల్ యాజమాన్యం మీ ఇష్టం ఉంటే ఉండండి, లేదంటే వెళ్లిపోండి అని అ లుసుగా ప్రవర్తిస్తున్నారని తల్లిదండ్రుల ఆవేదన**
- **మా విద్యార్థుల భవిష్యత్తు ఆగం అవుతుందని, ఎంతో మనోవేదనకు గురవుతున్న విద్యార్థినీ, విద్యార్థులు**
- **డిడి సోషల్ వెల్ఫేర్ కు తెలియజేయుటకు ప్రయత్నించిన అందుబాటులో లేరు**
- **కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున**

**నల్లగొండ,జూలై 04(వార్త వేదిక సూర్య):** నల్లగొండ జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థులు మంత్రులను, కలెక్టర్‌ను కలిసిన ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం మండే ఎండలో ధర్నాలు చేస్తున్నారు. కానీ ప్రభుత్వ అధికారులు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థులకు ఆల్ఫా స్కూల్ యాజమాన్యం వివక్షతకు పాల్పడుతుందని, సరైన బుక్స్ ఇవ్వకుండా దళిత విద్యార్థులను ఒంటరిగా కూర్చోబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున తెలిపారు. ఈరోజు పేరెంట్స్ తో కలిపి ఆల్ఫా పబ్లిక్ స్కూల్ ముందు ఎర్రటి ఎండలో పేరెంట్స్ స్టూడెంట్స్ ఉదయము నుండి ధర్నా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లలో దళిత విద్యార్థులకు ఉన్నత విద్య చదివించాలనే లక్ష్యం బూడిదలో పోసిన పన్నీరు లాగా మారుతుంది.నల్గొండ జిల్లా కేంద్రంలో ఉన్న ఆల్ఫా పబ్లిక్ స్కూల్లో దళిత విద్యార్థులకు బుక్స్ ఇవ్వకుండా, అందరినీ ఒకే క్లాసులో కాకుండా, దళిత విద్యార్థులను సపరేట్గా కూర్చోబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము,




విద్యార్థులకు సరిగా వసతులు కల్పించకుండా, నెల రోజులుగా తల్లిదండ్రులు ఎంతో మనోవేదనకు గురై ఈరోజు విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆల్ఫా స్కూల్ ముందు ధర్నాకు దిగడం జరిగిందన్నారు. ఆల్ఫా స్కూలు యజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ మీ ఇష్టం ఉంటే ఉండండి, లేదంటే వెళ్లిపోండి అని అ లుసుగా ప్రవర్తించారన్నారు. జిల్లా కలెక్టర్, సోషల్ వెల్ఫేర్ డిడి కలగజేసుకొని సమగ్రంగా విచారణ జరిపి, ఆల్ఫా స్కూల్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నామన్నారు. నల్లగొండ జిల్లాలో ప్రైవేట్ స్కూల్స్ యజమాన్యాలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి తను చెప్పిందే వినాలని ధోరణి ప్రదర్శిస్తున్నాయని అన్నారు. కొద్ది రోజులుగా పెండింగ్ బిల్లులు ఉండొచ్చు కానీ బిల్లులు రాలేదని నేపంతో ఫీజులు కట్టమని, పుస్తకాలు కొనుక్కోమని, విద్యార్థులను స్కూలు నుండి బయటకు వెళ్లగొడుతున్న పరిస్థితులు ఉన్న కనీసం పట్టించుకునే నాథుడే లేదని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లాలో బిఏఎస్ స్కీమ్ కింద ఉన్న విద్యార్థులకు అందరికీ సమాన విద్యా అందించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే కొనసాగితే భవిష్యత్తులో ఉద్యమ పోరాటాలు నిర్వహించవలసి వస్తుందని హెచ్చరించారు. ఆల్ఫా స్కూల్ ముందు జరిగే ధర్నా ఎస్సై టు టౌన్ సైదులు విచ్చేసి మాట్లాడిన ఫలితం లేకుండా పోయిందన్నారు. కాబట్టి సోమవారం వరకు పేరెంట్స్ ఓపికతో ఉంటారని లేని పక్షంలో తమ విద్యార్థులను అందరినీ ఆ స్కూలు నుండి పంపితే ఇతర బిఏఎస్ స్కీం కింద స్కూళ్లలో జాయిన్ అవుతామని వారు తెలిపారు. మా విద్యార్థుల భవిష్యత్తు ఆగం అవుతుందని, ఎంతో మనోవేదనకు విద్యార్థినీ, విద్యార్థులు గురవుతున్నారని, పేరెంట్స్ వాపోయారు. డిడి సోషల్ వెల్ఫేర్ కు తెలియజేయుటకు ప్రయత్నించిన అందుబాటులో లేకుండా ఉన్నారు. విద్యావ్యవస్థను గాడిలో పెట్టవలసిన బాధ్యత ప్రభుత్వం అధికారులు తీసుకోవాలని అన్నారు.. కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి గాదె నరసింహ, మండల కార్యదర్శి బొల్లు రవీంద్ర కుమార్, పేరెంట్స్ బండారు శంకర్, కత్తుల శివ, టి రవితేజ, రాజు, పేర్ల నరసింహ, కట్టా నవీన్, జి శ్రవణ్, వెంకటేష్, నాగరాజు, ఎం రజిత మేడిపల్లి పల్లవి, అరుణ, మేడిపల్లి లక్ష్మీ, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

# జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**- నల్లగొండలో బైక్ ర్యాలీ**

**నల్లగొండ,జూలై 04(వార్త వేదిక సూర్య):** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, జూలై 9న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు అంబటి సోమన్న, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు బి నరసింహ పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ,సిఐటియు, ఐ ఎన్ టి యు సి,ఐ ఎఫ్ టి యు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం క్లాక్ టవర్ వద్ద జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడవసారి అధికారాంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను మరియు కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను




మరింత దూకుడుగా అమలు చేస్తుందని ఆరోపించారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వంద సంవత్సరాల లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను ముందుకు తెచ్చిందని అన్నారు. వీటికి వ్యతిరేకంగా గత ఐదేళ్లుగా కార్మిక వర్గం చేస్తున్న ఆందోళన పోరాటాలతో లేబర్ కోడ్‌ల అమలు ఐదు సంవత్సరాలు ఆలస్యమైనా వాటిని ఇప్పుడు అమలు చేస్తూ పూర్తిగా కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని వాటిని నల్గొండ జిల్లాలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కేఎస్ రెడ్డి కోశాధికారి డి వెంకన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సలీం జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య,అద్దంకి నరసింహ, ఎస్. సాయిదాచారి , నగేష్,మల్లయ్య, ఐఎన్టీయూసీ జిల్లా వార్కింగ్ ప్రెసిడెంట్ మైనుద్దీన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల వెంకన్న, ఐఎఫ్టియు జిల్లా నాయకులు సాగర్ అయోధ్య, అశోక్,వివిధ సంఘాల నాయకులు , అవుటా రవీందర్, అశోక్ రెడ్డి, సంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సైదాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్సై సాయి కృష్ణను వెంటనే సస్పెండ్ చేయాలి

**లేనియెడల సేవలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా రాస్తారోకలు నిర్వహిస్తాం**

**సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొర్ర చందు నాయక్ డిమాండ్**

**దేవరకొండ, జూలై 04(వార్త వేదిక సూర్య):** దేవరకొండ నియోజకవర్గం సేవాలాల్ బంజారా సంఘం కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేస్తూ సేవాలాల్ బంజారా సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సక్రిబాయిని సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించినందుకు ఎస్సై సాయి కృష్ణను వెంటనే సస్పెండ్ చేయాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోర్ర చందు నాయక్ డిమాండ్ చేశారు అనంతరం వారు మాట్లాడుతూ సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు కొర్ర మోతిలాల్ నాయక్ మరియు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సక్రిబాయి ఆధ్వర్యంలో సైదాబాద్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. సైదాబాద్ ఎస్సై సాయి కృష్ణ సింగరేణి కాలనీలోని ఒక గిరిజనుడి సివిల్ లావా దేవి మ్యాటర్లో తల దూర్చి వారిని బెదిరించి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టారు.

ఈ అక్రమ అరెస్టు గురించి సైదాబాద్ పోలీస్ స్టేషన్ కి వెళ్లిన సేవాలాల్ బంజారా



సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సక్రిబాయి ఎస్సై సాయి కృష్ణను సివిల్ మ్యాటర్ గిరిజనుడు ను ఎందుకు అరెస్టు చేశారని అడిగితే ఆమెతో అసభ్యకరంగా మాట్లాడి ఆమెను పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టి సెల్ ఫోను గుంజుకొని అవమానించాడు.

ఒక గిరిజన సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలను అవమానించిన ఎస్సై సాయి కృష్ణను వెంటనే సస్పెండ్ చేయాలి వారిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి లేని పక్షంలో సేవాలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఉద్యమాలు చేపడతాం అని ధ్వజమెత్తారు

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY






## లాల్ బహదూర్ స్టేడియంలో జరిగే బహిరంగ సభకు బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు

**చౌటుప్పల్, జూలై 04(వార్త వేదిక సూర్య):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామ కమిటీ అధ్యక్షులు మరియు క్రియాశీలక కార్యకర్తల సమ్మేళనానికి విచ్చేయ చున్న ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే సందర్భంగా శుక్రవారం మునుగోడు నియోజకవర్గ చౌటుప్పల్ మండల మున్సిపాలిటీ లోను ఉన్నటువంటి గ్రామ కమిటీ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు బయల్దేరారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ముఖ్య కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి హైద్రాబాద్ లాల్ బహుదూర్ స్టేడియంలో ప్రసంగించనున్న కార్యక్రమానికి చౌటుప్పల్ మండలం కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు, ఈ కార్యక్రమంలో మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మండల అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో బిఆర్ఎస్ పార్టీ నాయకులను ఆపలేరు

**దేవరకొండ, జూలై 04(వార్త వేదిక సూర్య):** అక్రమ అరెస్టులతో బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఉద్యమాలను ఆపలేరని చింతపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు.నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న ఏఐసిసి




అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభలో భాగంగా అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల నిరసన కార్యక్రమం సందర్భంగా నేడు చింతపల్లి పోలీసులు బిఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘ విద్యార్థి యువజన సంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు చేసి అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు మా ఉద్యమాలు మరింత ఉధృతంగ నిర్వహిస్తామని మనీ తెలియజేస్తున్నాము మీరు ఎన్ని అక్రమ అరెస్టులు చేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నల్ల శంకర్ వందనపు ఆంజనేయులు ఉప్పల యాదయ్య మైనార్టీ నాయకులు కాలేధ్ బిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు ఆరెకంటి మురళి మాదిగ బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు సీమర్ల శ్రీను యాదవ్ ఆరెకంటి పృధ్వీరాజ్ రాశిక శ్రీశైలం మాసాని పవన్ తదితరులున్నారు

## ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి


**నల్లగొండ,జూలై 4(వార్తా వేదిక సూర్య):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని, జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ రోశయ్య చిత్ర పటానికి పూలమాల వేసి



ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రిగా పని చెయ్యడంతో పాటు ఆయన రాజకీయ జీవితంలో ప్రజాసేవలో నిమగ్నమై, చేసిన సేవల గురించి కొనియాడాడు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఏ. ఆర్ డీఎస్పీ శ్రీనివాస్,డి.సి.ఆర్.బి సీఐ శ్రీను,ఆర్.ఐ సంతోష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠ్య పుస్తకాలు అమ్మితే కఠినమైన చర్యలు : ఎం.ఈ.ఓ

**మోత్కూరు, జూలై 04 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్నటువంటి సీయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల, శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలను శుక్రవారం నాడు మండల విద్యాధికారి తీపి రెడ్డి గోపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు ట్రేడ్ లైసెన్సులు లేకుండా పాఠశాలలో పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్, పాఠశాల దుస్తులు అమ్ముతున్నారని తమ దృష్టికి వచ్చిందని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలో చిన్న తరగతులకే అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఫీజులను నియంత్రించుకోవాలని, లేని యెడల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రవణ్ కుమార్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ వీరస్వామి, వాడు అధికారి శ్రవణ్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు



# దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో భూ పోరాటాలను కొనసాగిద్దాం..

### - తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా పిలుపు

**చౌటుప్పల్, జూలై 04(వార్త వేదిక సూర్య):** భూమికోసం భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం వెట్టి చాకిరికి వ్యతిరేకంగా రైతులను కూలీలను పేదలను ఏకం చేసి దున్నేవారికి భూమి కావాలని సాయుధ పోరాటం నడిపి పోరాటంలో తొలి అమరుడు అమరజీవి కామ్రేడ్ దొడ్డి కొమరయ్య గారి 79వ వర్ధంతి స్ఫూర్తితో మరో మారు భూ పోరాటాలను కొనసాగిద్దామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు.

శుక్రవారం చౌటుప్పల్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో అమరజీవి దొడ్డి కొమరయ్య గారి 79 వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో "భూ సదస్సు " రాష్ట్ర కమిటీ సభ్యులు గంగదేవి సైదులు అధ్యక్షతన జరగగా సదస్సుకు ముందుగా దొడ్డి కొమరయ్య గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం నర్సింహ పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్న నేటికీ అనేక మందికి ఉండడానికి ఇల్లు లేక దున్నుకొని జీవించడానికి భూమిలేక అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. నాడు తెలంగాణ సాయుధ పోరాటంలో వెట్టిచాకిరి వ్యతిరేకంగా దున్న వాడికి భూమి కావాలని పోరాటాలు నడిపి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచితే నాటి భూస్వాములే నేడు పెట్టుబడుదారులుగా మారి వందలాది ఎకరాలను పరిశ్రమల పేరుతో, సెజ్ ల పేరుతో, ఫామ్ హౌజ్ ల పేరుతో కాజేస్తున్నారని విమర్శించారు. పేదలు గత 70, 80 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ ఉంటే పాలకులు మాత్రమే



వారికి పట్టా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో రాచకొండ ప్రాంతంలో మిగతా ప్రాంతాలలో వందలాది ఎకరాలు పేదలు సాగు చేసుకున్నారని వివిధ కారణాల పేరుతో కెసిఆర్ ప్రభుత్వం వారందరికీ నూతన పాస్బుక్కులు ఆపి వారి హక్కులను కాలరాచారని అన్నారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆ భూములకు పట్టాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లాలో ఆరు మండలాలలో నాలుగు మున్సిపల్ పట్టణాల్లో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధాన్ని ఎత్తివేయాలని, చౌటుప్పల్ మండలంలోని మల్కాపురం, సింగరాయ చెరువు, తూప్రాన్ పేట, చిన్న కొండూరు, ధర్మోజి గూడెం, పీపులపాడు, నాగారం, లింగోటం, లక్కారం తోపాటు వివిధ గ్రామాలలో ఉన్న భూ సమస్యను వెంటనే పరిష్కరించి పట్టాదారు పాస్బుక్ ఇవ్వాలని లేకపోతే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని నర్సింహ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి. పాషా, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి బొజ్జ బాలయ్య, ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు గోశిక కరుణాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బోయ యాదయ్య పాల్గొని మాట్లాడగా ఇంకా వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు యాట ముత్యాలు, యాట బాలరాజు, పొట్ట వెంకటయ్య, జంగం అంజయ్య తోపాటు సాగుదారులు టి మల్లేష్, యాట వెంకటేష్, గోపాల్, కిష్టయ్య, సైదులు, శంకరయ్య, యాదయ్య, శ్రీకాంత్, వెంకటేశం, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వానాకాలం సీజన్ కొనుగోలు కేంద్రాలకు ప్యాడి, క్లీనర్లు, తార్పాలిన్లు ఏర్పాటు చేయాలి

### - అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**యాదాద్రి భువనగిరి,జూలై 04(వార్త వేదిక సూర్య):** రానున్న వానాకాలం సీజన్ కొరకు జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు అవసరమైన ప్యాడీ క్లీనర్లు, తార్పాలిన్ల అవసరాన్ని అంచనా వేయాలని, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రోజు తన ఛాంబర్‌లో అధికారులతో మాట్లడుతూ అవసరాలకు అనుగుణంగా స్పెసిఫికేషన్లను ఖరారు చేయడం కొరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించడం కోసం ఒక జిల్లా కొనుగోలు కమిటీను ఏర్పాటు చేయబడినది.

ఈ సమావేశంలో జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులుగా ఉన్న రెవిన్యూ అదనపు కలెక్టర్ చైర్మన్ ,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా సహకార అధికారి,జిల్లా వ్యవసాయ అధికారి ,జిల్లా మార్కెటింగ్ అధికారి , జిల్లా మేనేజర్, జిల్లా పౌర సరఫరాల అధికారి జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి సభ్యులుగా పాల్గొన్నారు.

ఈ కమిటీ ప్యాడీ క్లీనర్లు, తార్పాలిన్లు అవసరమైన PPCలను గుర్తించి, ముందస్తు కొనుగోళ్లు జరిపి రానున్న సీజన్ లో కొనుగోళ్ల






ప్రక్రియకు సమాయత్తం చేస్తుంది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి,జిల్లా పౌర సరఫరా అధికారి హరి కృష్ణా,జిల్లా సివిల్ సప్లై అధికారి రోజా రాణి, మార్కెటింగ్ అధికారి సవితా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ టీచర్ ఉపేందర్ రావు చొరవతో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

**తుర్కపల్లి, జూలై 04(వార్త వేదిక సూర్య):** తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అనుదీప్ సొసైటీ ఏఎస్ రావు నగర్ వారి ఆధ్వర్యంలో బల్ల ఉపేందర్ రావు రిటైర్డ్ టీచర్ చొరవతో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అనుదీప్ సొసైటీ తరపున పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్సిల్లు అందివ్వడం సంతోషకరమైన విషయం అని అన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మంచిగా చదువుకునే విద్యార్థులకు ఇలాంటి సొసైటీలు దాతలు అండగా ఉండడం అభినందనీయమని అన్నారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే అనేక సొసైటీలు పనిచేస్తున్నాయని అనుదీప్ సొసైటీ మన పాఠశాలతో అసోసియేట్ కావడం ముదావహం అన్నారు. అనుదీప్ సొసైటీ ప్రతినిధి నూలు రామచంద్రరావు మాట్లాడుతూ అనుదీప్ సొసైటీ విద్యార్థుల శ్రేయస్సు కోసం ఈ చక్కటి కార్యక్రమాన్ని చేపట్టిందని వీటిని సరియైన విధంగా



వినియోగించుకోవాలని, మార్కుల కోసం కాకుండా కాన్సెప్ట్ అర్థం చేసుకుంటూ నిజ జీవితానికి ఆయా అంశాలను జోడిస్తూ మంచి ఉన్నత విలువలు కలిగిన వ్యక్తులుగా ఎదగాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో తరగతిలో మంచి మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేసా శ్రీనివాసాచారి, పెద్ది బిక్ష మయ్య, పలుగుల సతీష్ కుమార్, దూదిపాల జ్యోతి, చింతలపూడి విశ్వేశ్వరరావు, ముసుకుల సుజాత, శ్రీరాంభట్ల మాధురి, బాశెట్టి విష్ణు, బీరవెల్లి హరిత, బండి మధుకర్, రాజమైన అంబాజీ, అదరాసుపల్లి వెంకటలక్ష్మి, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిస్తాం..

### లాయర్స్ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్, హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి

**సంస్థాన్ నారాయణపురం, జూలై 04(వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లాలోని నారాయణపురంలో మండలం మల్లారెడ్డి గ్రామంలో కురుమ యువ చైతన్య సమితి యాదవ సంఘం తెలంగాణ సామాజిక చైతన్య వేదిక మరియు వివిధ సామాజిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అఖిల్ భారతీయ న్యాయవాద సంయుక్త ఆదివక్త మంచ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి కురుమ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య గారు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కి నిదర్శనం తెలంగాణ తొలి అమరుడు ఆయన ఆశయాలను కొనసాగించి బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారాన్ని సాధించడంలో ముందుంటామని తెలియజేశారు.

జనగామ జిల్లాకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ సామాజిక చైతన్య వేదిక నాయకులు కొల్ల మహేష్, సింగం కృష్ణ, సాగర్ నాయక్, కురుమ యువ చైతన్య సమితి నాయకులు నర్రి ఎట్టయ్య, అశోక్, మల్ల యాదయ్య, నర్రి వెంకన్న,నర్రి అంజనేయులు, నర్రి మహేందర్ నరసింహ,యాదవ్ సంఘం నాయకులు జీనకల ఫకీరు, జీను కల వెంకటేష్, అనేకమంది గ్రామ ప్రజలు సామాజిక సంఘాల నాయకులు పాల్గొన్నారు






# స్వామి వివేకానంద బోధనలు ఆదర్శనీయం

### - బీవీపీ సంస్కార్ కన్వీనర్ యువరాజు

**చౌటుప్పల్, జూలై 04(వార్త వేదిక సూర్య):** యువతలో స్ఫూర్తి నింపే స్వామి వివేకానంద బోధనలు నిరంతరం ఆదర్శనీయమని భారత్ వికాస్ పరిషత్ కొమురంభీమ్ శాఖ సంస్కార్ కన్వీనర్ చినుకని యువరాజు పేర్కొన్నారు.

చౌటుప్పల్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వేదికపై భారత ఆధ్యాత్మిక గొప్పదనం చాటిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా శుక్రవారం పురపాలక పరిధిలోని తంగడపల్లిలో స్వామి వివేకనంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువరాజు మాట్లాడుతూ స్వామి వివేకానంద గొప్ప ఆధ్యాత్మికవేత్త, యువతకు మార్గదర్శకుడని, ఆయన జీవితం ఆత్మబలంతో కూడిన సందేశాలు ప్రతి యువకుల్ని మార్గదర్శనం చేస్తాయని తెలిపారు. ప్రపంచ వేదికపై భారత ఆధ్యాత్మిక గొప్పదాన్ని చాటిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనదని కొనియాడారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత గొప్పతనాన్ని, యువతలో స్ఫూర్తి నింపే ఆయన బోధనలు ఎప్పటికీ ఆదర్శనీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో బివిపి శాఖ అధ్యక్షులు చీకురి వెంకటేశం గౌడ్, కార్యదర్శి నేదనూరి గణేష్, రాచమల్ల వెంకన్న, బొల్లమోని శ్రీశైలం, గట్టు మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# సినీ వార్తలు



# చరిత్ర సృష్టించిన 'హరి హర వీరమల్లు' ట్రైలర్

## 24 గంటల్లో అత్యధిక వ్యూస్ సాధించిన తెలుగు ట్రైలర్‌గా 'హరి హర వీరమల్లు' రికార్డు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా వస్తుందంటే.. తెలుగు సినీ పరిశ్రమలో సరికొత్త రికార్డులు నమోదవ్వడం సహజం. తాజాగా 'హరి హర వీరమల్లు' ట్రైలర్ తో ఈ విషయం మరోసారి రుజువైంది. ట్రైలర్ విడుదలైన క్షణం నుండి అభిమానులు, ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. పవన్ కళ్యాణ్ మునుపెన్నడూ చూడని చారిత్రక యోధుడు పాత్రలో కనిపించడం అందరినీ ఆకర్షించింది. ట్రైలర్‌లో ప్రతి ఫ్రేమ్ అద్భుతంగా ఉందంటూ సినీ ప్రముఖులు సైతం ప్రశంసిస్తున్నారు. పవన్ కళ్యాణ్ కట్టిపడేసే లుక్స్, స్క్రీన్ ప్రజెన్స్ తో.. ఇటీవల కాలంలో వచ్చిన అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా 'హరి హర వీరమల్లు' ట్రైలర్ ప్రశంసలు అందుకుంటోంది.'హరి హర వీరమల్లు' చిత్రం ట్రైలర్ నుంచే ఇండస్ట్రీ రికార్డులను బద్దలు కొట్టడం ప్రారంభిస్తుందని దర్శకుడు జ్యోతి కృష్ణ చెప్పారు. ఆయన మాటే నిజమైంది. 'హరి హర వీరమల్లు' ట్రైలర్ తెలుగులో కేవలం 24 గంటల్లోనే 48 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి, తెలుగు సినిమాల పరంగా సరికొత్త రికార్డును నెలకొల్పింది. అన్ని భాషల్లో కలిపి దాదాపు 62 మిలియన్ల వ్యూస్ సాధించింది.

దర్శకుడు జ్యోతి కృష్ణ ట్రైలర్ ను రూపొందించిన తీరు అందరినీ మంత్రం ముగ్దుల్ని చేసింది. ట్రైలర్ అందరి అంచనాలకు మించేలా ఉంది. వీరమల్లును ఆయన ఒక పాత్రగా కాకుండా, సినిమాటిక్ శక్తిగా మలిచారు. బలమైన భావోద్వేగాలు, అద్భుతమైన యుద్ధ సన్నివేశాల మేళవింపుతో ట్రైలర్ ను మలిచిన తీరు మెప్పించింది. దీని ప్రభావం అన్ని వర్గాల ప్రేక్షకులలో ప్రతిధ్వనిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి తన నేపథ్య సంగీతంతో



ట్రైలర్ ను మరోస్థాయికి తీసుకెళ్ళారు. విజువల్స్ కు ప్రాణం పోశారని చెప్పవచ్చు. తన సంగీతంతో అటు భావోద్వేగ సన్నివేశాలు, ఇటు యుద్ధ సన్నివేశాల గాఢతను పెంచారు. చారిత్రక కథకు తగ్గట్టుగా కీరవాణి అందించిన సంగీతం.. ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేస్తోంది. ఛాయాగ్రాహకులు జ్ఞాన శేఖర్ వి.ఎస్., మనోజ్ పరమహంస సన్నివేశాలను ఎంతో అందంగా చిత్రీకరించారు. ప్రతి ఫ్రేమ్ ఒక పెయింటింగ్‌లా ఉంది. చారిత్రక కథకు తగ్గట్టు భారీతనాన్ని చూపిస్తుంటే.. కథలోని భావోద్వేగాన్ని, వీరమల్లులోని ఆవేశాన్ని చక్కగా కెమెరాలో బంధించారు. ఇక ప్రముఖ కళా దర్శకుడు తోట తరణి తన అద్భుతమైన సెట్‌లతో ప్రేక్షకులను మొఘల్ యుగంలోకి తీసుకువెళ్లారు.

మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.ఎం. రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మించిన ఈ చిత్ర నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయి. చిత్ర బృందం యొక్క ఆశయాన్ని, నైపుణ్యాన్ని ప్రతిబింబించేలా ట్రైలర్ ఉంది. అందుకే ప్రేక్షకులు, అభిమానులు, పరిశ్రమ వర్గాల నుండి ఏకగ్రీవంగా ప్రశంసలు అందుకుంటోంది.

రాజ కుటుంబీకురాలుగా నిధి అగర్వాల్ కనిపించడం, ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్ స్క్రీన్ ప్రజెన్స్, సాయి మాధవ్ బుర్రా రాసిన శక్తివంతమైన సంభాషణలు కూడా ట్రైలర్ కు మరింత బలాన్ని జోడించాయి.

ట్రైలర్‌తోనే ఈస్థాయి సంచలనాలు సృష్టించిన 'హరి హర వీరమల్లు' చిత్రం.. జూలై 24వ తేదీన తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. తుఫాను ఇప్పుడే ప్రారంభమైంది. వీరమల్లు దానిని ముందుండి నడిపిస్తున్నాడు.

### 'కూలీ' నుంచి దహాగా అమీర్‌ఖాన్

# పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్ రిలీజ్



సూపర్ స్టార్ రజనీకాంత్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'కూలీ'కి లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన లోకేష్ సినిమాటిక్ యూనివర్స్‌తో తన విజయాలని కొనసాగిస్తున్నారు. ప్రతిష్టాత్మక సన్ పిక్చర్స్ బ్యానర్ నిర్మించిన కూలీలో రీసెంట్ కుబేర తో బ్లాక్ బస్టర్ అందుకున్న కింగ్ నాగార్జున పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ రోజు మేకర్స్ అమీర్‌ఖాన్ ని దహాగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. గోల్డెన్ వాచ్, గోల్డ్ ఫ్రేం వున్న గ్లాసెస్ ధరించి సిగార్ తాగుతూ అమీర్‌ఖాన్ ఇంటెన్స్ లుక్ లో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. డి. సురేష్ బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూలీ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. ఇది ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న మ్యాసీవ్ హైప్‌ను సూచిస్తోంది. రజనీకాంత్, నాగార్జునలతో పాటు సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్, మహేంద్రన్ వంటి ప్రముఖులు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ గ్రాండ్ గా విడుదల చేయనుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి. 'చికిటు' సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. కలానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. అనిరుధ్ సంగీతం, గిరీష్ గంగాధరన్ సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ ఫిలోమిన్ రాజ్. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది.

# మిస్టీరియస్ టీజర్




అలనాటి 'రక్త కన్నీరు' నాగభూషణం మనవడు అబిద్ భూషణ్ హీరోగా బిగ్ బాస్ ఫేమ్ రోహిత్ సహాని జంటగా వస్తున్న చిత్రం మిస్టీరియస్". ఆష్లీ క్రియేషన్స్ బ్యానర్ పై ఉషా మరియు శివాని నిర్మించిన ఈ చిత్రానికి మహి కోమటిరెడ్డి దర్శకత్వం వహించారు. రియా కపూర్ మరియు మేఘనా రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రం నుండి ఇప్పటికే రిలీజ్ చేసిన రెండు పాటలతో సినిమా మీద అంచనాలు పెరిగాయి. ఇక తాజాగా ఈ చిత్ర టీజర్‌ను ఘనంగా లాంచ్ చేసింది మూవీ టీమ్ ఈ సందర్భంగా డైరెక్టర్ మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ "సస్పెన్స్ జానర్ లో వస్తున్న ఈ సినిమా ఆడియన్స్ కి సరికొత్త ఎక్స్పీరియన్స్ ఇస్తుందని ,తాజాగా టీజర్ కి వచ్చిన రెస్పాన్స్ తో సినిమా సక్సెస్ పై మరింత కాన్ఫిడెన్స్ పెరిగిందని" చెప్పుకొచ్చారు.

ఇక నిర్మాతలు ఉషా మరియు శివాని మాట్లాడుతూ "సినిమాని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించామని ,టీజర్ అందరికీ నచ్చడం సంతోషమని,ఫ్యూచర్లో మరిన్ని మంచి సినిమాలతో ఆడియన్స్ ని ఎంటర్ టైన్ చేస్తామని" తెలిపారు. ఇక సినిమాలో జంటగా నటించిన అబిద్ భూషణ్, రోహిత్ సహాని మాట్లాడుతూ "ఇంతమంచి అవకాశాన్ని ఇచ్చిన డైరెక్టర్ ,ప్రొడ్యూసర్స్ కి చాలా థాంక్స్ అని ,ఇప్పటికే రిలీజ్ అయిన రెండు పాటలు మంచి టాక్ తెచ్చుకోవడంతో పాటు రిలీజ్ అయిన టీజర్ కి కూడా మంచి అప్లాజ్ రావడం ఆనందంగా ఉందని" తమ సంతోషాన్ని పంచుకున్నారు.

# స్పోర్ట్స్ | SPORTS

# గిల్ దెబ్బకు దిగ్గజాల రికార్డులు గల్లంతు

భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన ఆండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ రెండో టెస్ట్ మ్యాచ్‌లో భారత్ అద్భుతంగా ఆడింది. టెస్ట్ రెండో రోజున కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ డబుల్ సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో గిల్ ఇప్పటివరకు తన టెస్ట్ కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడు. 4వ స్థానంలో బ్యాటింగ్ చేసిన అతను 387 బంతుల్లో 30 ఫోర్లు, 3 సిక్సర్లతో 269 పరుగులు చేసి, తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 587 పరుగుల భారీ స్కోరు సాధించడంలో సహాయపడ్డాడు. ఈ చారిత్రాత్మక ఇన్నింగ్స్‌లో, గిల్ తన పేరు మీద అనేక పెద్ద రికార్డులను క్రియేట్ చేశాడు. శుభ్‌మన్ గిల్ తన మొదటి రోజు స్కోరు 114 పరుగులకు మొదలు పెట్టి.. రవీంద్ర జడేజాతో కలిసి 203 పరుగుల భాగస్వామ్యాన్ని పంచుకున్నాడు. తర్వాత వాషింగ్టన్ సుందర్‌తో కలిసి 144 పరుగులు జోడించాడు. ఆల్ రౌండర్ బ్యాట్స్‌మెన్ ఇద్దరూ కెప్టెన్ గిల్‌కు సపోర్టుగా నిలిచారు. రవీంద్ర జడేజా సెంచరీ మిస్ అయితే వాషింగ్టన్ తన అర్ధ సెంచరీని మిస్ చేసుకున్నాడు. జడేజా 89 పరుగులు చేయగా, సుందర్ 42 పరుగులు అందించాడు. ఈ రికార్డ్ బ్యాటింగ్ కారణంగా, గిల్ మొత్తం 12 రికార్డులను తన పేరిట నమోదు చేసుకున్నాడు.

1. టెస్టుల్లో భారత కెప్టెన్ చేసిన అత్యధిక స్కోరు: 2019 లో పూణేలో దక్షిణాఫ్రికాపై 254 పరుగులు చేసిన విరాట్ కోహ్లీ రికార్డ బ్రేక్ చేశాడు.
2. ఇంగ్లాండ్‌లో భారత బ్యాట్స్‌మన్ చేసిన అత్యధిక టెస్ట్ స్కోరు: 1979లో ది ఓవల్‌లో సునీల్ గవాస్కర్ చేసిన 221 పరుగుల రికార్డును శుభ్‌మాన్ గిల్ రికార్డ్ బ్రేక్ చేశాడు.
3. విదేశీ గడ్డపై 250ం పరుగులు చేసిన మూడవ భారతీయ బ్యాట్స్‌మన్: వీరేంద్ర సెహ్వాగ్ (309, ముల్తాన్ , 254, లాహెూర్) రాహుల్ ద్రవిడ్ (270, రావల్పిండి) తర్వాత ఈ ఘనత సాధించిన మూడవ భారతీయ బ్యాట్స్‌మన్‌గా గిల్ నిలిచాడు.
4. విదేశాల్లో టెస్ట్ డబుల్ సెంచరీ చేసిన రెండవ భారత కెప్టెన్: విరాట్ కోహ్లీ 2016లో నార్త్ సౌండ్‌లో వెస్టిండీస్‌పై 200 పరుగులు చేశాడు.
5. టెస్టలలో డబుల్ సెంచరీ చేసిన ఆరో భారత కెప్టెన్: మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ, సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోని, విరాట్ కోహ్లీ (7 సార్లు) తర్వాత డబుల్ సెంచరీ చేసిన ఆరో భారత కెప్టెన్‌గా గిల్ నిలిచాడు.
6. టెస్టుల్లో డబుల్ సెంచరీ చేసిన రెండవ అతి పిన్న వయస్కుడైన భారత కెప్టెన్: గిల్ 25ఏళ్ల 298 రోజుల వయసులో ఈ ఘనత సాధించాడు.




దీనికంటే ముందు మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ 23ఏళ్ల 239 రోజుల వయసులో డబుల్ సెంచరీ చేశాడు.

7. ఇంగ్లాండ్‌లో టెస్ట్‌ల్లో 250ం పరుగులు చేసిన మూడవ విదేశీ కెప్టెన్: ఇంగ్లాండ్‌లో టెస్ట్ మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌లో 250 కంటే ఎక్కువ పరుగులు చేసిన మూడవ విదేశీ కెప్టెన్‌గా గిల్ నిలిచాడు. ఈ ఘనతను ఆస్ట్రేలియాకు చెందిన బాబ్ సింప్సన్ (311 పరుగులు, 1964) దక్షిణాఫ్రికాకు చెందిన గ్రాహం స్మిత్ (277, 259 పరుగులు, 2003) చేశాడు.
8. ఇంగ్లాండ్‌పై వరుసగా మూడు టెస్టుల్లో సెంచరీలు సాధించిన నాల్గవ భారతీయుడు: మొహమ్మద్ అజారుద్దీన్, దిలీప్ వెంగ్‌సర్కార్, రాహుల్ ద్రవిడ్ (రెండుసార్లు) తర్వాత ఈ ఘనత సాధించిన నాల్గవ భారతీయ బ్యాట్స్‌మన్ గిల్.
9. ఇంగ్లాండ్‌పై వరుసగా టెస్ట్ సెంచరీలు సాధించిన మూడవ భారత కెప్టెన్: విజయ్ హజారే , మహ్మద్ అజారుద్దీన్ తర్వాత ఈ ఘనత సాధించిన మూడవ భారత కెప్టెన్‌గా గిల్ నిలిచాడు.
10. కెప్టెన్‌గా మొదటి టెస్ట్‌లో సెంచరీ, రెండవ టెస్ట్‌లో డబుల్ సెంచరీ చేసిన రెండవ భారతీయుడు: తన కెప్టెన్సీ కెరీర్‌లోని మొదటి రెండు టెస్ట్‌లలో సెంచరీ, డబుల్ సెంచరీ సాధించిన సునీల్ గవాస్కర్ తర్వాత గిల్ ఈ ఘనతను సాధించాడు.
11. శ్రీలంకకు చెందిన తిలకరత్నే దిల్షాన్ 2011లో లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌పై 193 పరుగులు చేశాడు. ఇది ఒక ఆసియా కెప్టెన్ చేసిన అత్యధిక స్కోరు.
12. శుభ్‌మాన్ గిల్ ఇప్పుడు దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా లలో టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. ఇంతకు ముందు ఈ రికార్డు 2004లో సిడ్నీలో ఆస్ట్రేలియాపై అజేయంగా 241 పరుగులు చేసిన సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది.




# కెప్టెన్సీ చేసే అవకాశం ఇప్పుడు లేదు

### భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా

టెస్ట్ క్రికెట్‌లో భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. రోహిత్ శర్మ కెప్టెన్సీ నుంచి తప్పుకున్న తర్వాత జడేజా పేరు కెప్టెన్సీ, వైస్-కెప్టెన్సీ రేసులో పెద్దగా వినిపించలేదు. యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు టీమిండియా టెస్ట్ సారథ్య బాధ్యతలు దక్కాయి. జడేజా కూడా తనకు టీమిండియా కెప్టెన్సీ బాధ్యతలు చెపట్టే అవకాశాలు లేవని అంగీకరించాడు.దాంతో సీనియర్ ఆటగాడిగా జట్టులో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో జడేజా అద్భుత ప్రదర్శన కనబర్చాడు. 137 బంతుల్లో 89 పరుగులు చేసి తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. శుభ్‌మన్ గిల్‌తో కలిసి 6వ వికెట్‌కు 203 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 587 పరుగులు భారీ స్కోర్ చేసింది.రెండో రోజు ఆట అనంతరం జడేజా మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా టీమిండియా కెప్టెన్సీ చేయాలనే కోరిక ఉందా అని విలేకరులు ప్రశ్నించగా.. 'ఆ అవకాశం ఇప్పుడు లేదు'అని జడేజా నవ్వుతూ బదులిచ్చాడు.కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్‌పై జడేజా ప్రశంసల జల్లు కురిపించాడు. 'నిజాయితీగా చెప్పాలంటే.. శుభ్‌మన్ గిల్ ఆత్మవిశ్వాసం అద్భుతం. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు అతను అసలు కెప్టెన్‌గా కనిపించలేదు. అదనపు బాధ్యతలను సమర్థవంతంగా మోస్తున్నాడు. ఈ రోజు దురదృష్టవశాత్తు ఔటయ్యాడు తప్పా.. ఈ ఇన్నింగ్స్‌లో అతను ఔట్ అవుతాడని నాకు అనిపించలేదు. చాలా బాగా ఆడాడు. మేము బ్యాటింగ్ చేసేటప్పుడు భాగస్వామ్యాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనేదానిపై చర్చించుకున్నాం.'అని జడేజా చెప్పుకొచ్చాడు.గిల్‌తో కలిసి జడేజా 203 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో భారత్ భారీ స్కోరు వైపు దూసుకెళ్లింది. అయితే, జోష్ టంగ్ వేసిన షార్ట్-పిచ్ బంతిని పుల్ చేయబోయి జడేజా ఔటయ్యాడు. ఆ తర్వాత గిల్ (269) వాషింగ్టన్ సుందర్ (42)తో కలిసి 144 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారత్ 587 పరుగులు చేసింది.అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఇంగ్లండ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 20 ఓవర్లలో 3 వికెట్లకు 77 పరుగులు చేసింది. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్ ఓ వికెట్ పడగొట్టాడు. భారత బౌలర్ల ధాటికి ఇంగ్లండ్.. తమ బజ్‌బాల్ గేమ్‌ను పక్కన పెట్టి జిడ్డు బ్యాటింగ్‌తో అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్ ఆడింది. బెన్ డకెట్ (0), ఆలీ పోప్ (0), జాక్ క్రాలీ (19) విఫలమవ్వగా.. హ్యారీ బ్రూక్(30 బ్యాటింగ్), జోరూట్(18 బ్యాటింగ్) ఆచితూచి ఆడి ఇంగ్లండ్‌ను ఆదుకున్నారు.మూడో రోజు ప్రణాళిక గురించి జడేజా మాట్లాడుతూ, "మేము ఎక్కువగా ఆలోచించడం లేదు. మూడో రోజు ఆటలో లంచ్ బ్రేక్ సమయానికి 2-3 వికెట్లు తీయాలి. అలా చేస్తే, మేము కచ్చితంగా ఆటలో ముందుంటాము. పెద్ద భాగస్వామ్యాలు నమోదైనా.. ఆటను తేలికగా తీసుకోము. ఈ రోజు ఉత్సాహంగా ఆడాము. అదే జోరును కొనసాగించే ప్రయత్నం చేస్తాం. అనుకూల ఫలితం వస్తుందని ఆశిస్తున్నాం.'అని జడేజా చెప్పుకొచ్చాడు.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya.yadadri@gmail.com**